

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 26-09-2025 | సంపుటి - 25 | సంచిక -134 | రూ : 4 | పేజీలు: 8


## శ్రీవారి భక్తులకు గుడ్ న్యూస్
## అందుబాటులోకి కొత్త సౌకర్యాలు

- ఉపరాష్ట్రపతి, సీఎం చేతుల మీదుగా వేంకటాద్రి నిలయం ప్రారంభం
- భక్తుల కోసం అత్యాధునిక వసతి సముదాయం



2లో



2లో

### తమిళనాడు ప్రభుత్వ ఆహ్వానం..
## చెన్నైకి సీఎం రేవంత్ రెడ్డి

- మహా విద్యా చైతన్య ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు
- మధ్యాహ్నం 1 గంటకు ప్రత్యేక విమానంలో చెన్నైకి పయనం
- నిన్న పాట్నాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో పాల్గొన్న సీఎం

## మిగ్-21 విమాన స్థానంలో తేజస్ జెట్‌లు..
### హెచ్ఏఎల్‌తో రక్షణ శాఖ ఒప్పందం

- రూ. 62,370 కోట్లతో 97 తేజస్ విమానాల కొనుగోలుకు సంబంధించి ఒప్పందం
- సమీకరిస్తున్న 97 విమానాల్లో 68 యుద్ధ విమానాలు, 29 ట్విన్ సీటర్లు
- 2027-28 నుంచి వీటి సేకరణ ప్రారంభమవుతుందని రక్షణ శాఖ వెల్లడి



2లో

## తెలంగాణ ఇంటర్ విద్యలో మార్పులు
### సిలబస్ మార్పుతో పాటు ఏఐ కోర్సులు!

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి మారనున్న ఇంటర్ సిలబస్, పరీక్షల విధానం
- నవంబర్ నుంచి విద్యార్థులకు ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తరగతులు
- లెక్చరర్ల కొరత తీర్చేందుకు 494 మంది గెస్ట్ లెక్చరర్ల నియామకానికి ఆమోదం




2లో

## నేను భారత్‌కు పెద్ద అభిమానిని
## ఆ దేశమంటే చాలా ఇష్టం

- భారత్‌తో ఇంధన వాణిజ్యాన్ని మరింత పెంచుకోవడానికి ఎదురు చూస్తున్నామని వ్యాఖ్య
- అద్భుతమైన మిత్ర దేశం భారత్‌తో ఇంధన సహకారాన్ని విస్తరించుకోవాలన్న మంత్రి
- న్యూఢిల్లీపై పెనాల్టీలు విధించాలని అమెరికా కోరుకోవడం లేదన్న క్రిస్ రైట్



2లో



2లో

## అగ్నిప్రైమ్ ప్రయోగం సక్సెస్..

- విజయవంతంగా అగ్ని-ప్రైమ్ క్షిపణి ప్రయోగం
- దేశంలో తొలిసారిగా రైలు మొబైల్ లాంచర్ నుంచి పరీక్ష

### తెలంగాణలో భారీ వర్షాలు.. కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు



2లో

## స్మితా సబర్వాల్ పై చర్యలు వద్దు.. హైకోర్టు

- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో తన పేరు చేర్చడంపై స్మిత అభ్యంతరం
- కమిషన్ నివేదికను కొట్టివేయాలంటూ న్యాయస్థానంలో పిటిషన్
- ఈ నివేదిక ఆధారంగా స్మితా సబర్వాల్ పై చర్యలు తీసుకోవద్దన్న కోర్టు



2లో



2లో

## దీని కోసం ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సిన అవసరంలేదు

### నారా లోకేశ్‌కు చెప్పిన సీఎం చంద్రబాబు

- మెగా డీఎస్సీ విజేతలకు నియామకపత్రాలు అందించిన సీఎం చంద్రబాబు
- సచివాలయం సమీపంలో ఓ వేడుకలా కార్యక్రమం
- ఇకపై ప్రతి ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన
- 150 రోజుల్లో మెగా డీఎస్సీ పూర్తి చేసిన మంత్రి లోకేశ్ బృందానికి అభినందనలు

# శ్రీవారి భక్తులకు గుడ్ న్యూస్.. అందుబాటులోకి కొత్త సౌకర్యాలు

తిరుమల, సెప్టెంబరు 25 : తిరుమల శ్రీవారి భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి పలు కీలక అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన 'వేంకటాద్రి నిలయం' యాత్రికుల వసతి సముదాయాన్ని (పీఏసీ5) ఉపరాష్ట్రపతి, సీఎం లాంఛనంగా ప్రారంభించారు. దీంతో పాటు, శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యతను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన విజన్ బేస్ట్ స్టోరింగ్ మెషిన్‌కు కూడా శ్రీకారం చుట్టారు. అంతకుముందు, ప్రాంగణానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రికి టీటీడీ అధికారులు మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసిన అనంతరం వారు భవనాన్ని కలియతిరిగి భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. వసతి గృహం బుకింగ్ కౌంటర్ పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం, తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను (ఐసీసీసీ) కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ ఆయన వెంట ఉన్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బుధవారం రాత్రి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పద్మావతి అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా భేటీ అయిన విషయం తెలిసిందే.



## మిగ్21 విమాన స్థానంలో తేజస్ జెట్‌లు.. హెచ్ఏఎల్‌తో రక్షణ శాఖ ఒప్పందం

ఢిల్లీ, సెప్టెంబరు 25 : భారత వాయుసేనలో తేజస్ యుద్ధ విమానాలు చేరనున్నాయి. రక్షణ శాఖ... దశాబ్దాలుగా కీలక సేవలు అందించిన మిగ్21 యుద్ధ విమానాలకు వీడ్కోలు పలికి వాటి స్థానంలో తేజస్ జెట్లను ప్రవేశపెట్టనుంది. ఈ క్రమంలో రూ. 62,370 కోట్లతో 97 తేజస్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తో రక్షణ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపిన నెలలోపే ఈ ఒప్పందం ఖరారైంది. మిగ్21 యుద్ధ విమానాల స్థానంలో ఈ సింగిల్ ఇంజిన్ ఎంకే1ఏ తేజస్ జెట్‌లను ప్రవేశపెడుతున్నారు. తాజాగా సమీకరిస్తున్న 97 విమానాల్లో 68 యుద్ధ విమానాలు, 29 ట్విన్ సీటర్ ట్రైనర్ జెట్లు ఉండనున్నట్లు రక్షణ శాఖ వెల్లడించింది. ఈ అత్యాధునిక ఫైటర్ జెట్‌లలో ఉత్తమ్ ఏఈఎస్ఏ రాడార్, స్వయం రక్షా కవచ్ వ్యవస్థలతో పాటు కంట్రోల్ యాక్చుయేటర్‌లు ఉంటాయి. వీటిలో 64 శాతానికి పైగా దేశీయ కంటెంట్, 67 దేశీయ ఉత్పత్తులు ఉండనున్నట్లు రక్షణ శాఖ తెలిపింది. 202728 నుండి వీటి సేకరణ ప్రారంభమవుతుందని, తద్వారా వాయుసేన సామర్థ్యాలు పెరగడంతో పాటు ఆత్మనిర్భర్ భారత్, భారత రక్షణ సంసిద్ధతలను మరింత పెంపొందిస్తుందని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ ప్రాజెక్టు రాబోయే ఆరేళ్లలో ఏడాదికి 11,750 ఉద్యోగాలను సృష్టిస్తుందని అంచనా.

## నేను భారత్‌కు పెద్ద అభిమానిని, ఆ దేశమంటే చాలా ఇష్టం

అమెరికా, సెప్టెంబరు 25 : భారత్‌కు తాను పెద్ద అభిమానినని, ఆ దేశమంటే తనకు చాలా ఇష్టమని అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్ అన్నారు. ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌తో ఇంధన వాణిజ్యాన్ని మరింతగా పెంచుకోవడానికి ఎదురు చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు. న్యూయార్క్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ అద్భుత మిత్ర దేశమైన భారత్‌తో అమెరికా ఇంధన సహకారాన్ని విస్తరించుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం భారత్ మరో అంశంలో చిక్కుకుందంటూ, రష్యా నుంచి చమురు కొనుగోలును ఉద్దేశించి అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయాల్సిన అవసరం భారత్‌కు లేదని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే తక్కువ ధరకు లభించడం వల్ల ఆ కొనుగోళ్లను కొనసాగిస్తోందని అన్నారు. కానీ చమురు విక్రయాలతో వచ్చిన ఆదాయాన్ని రష్యా యుద్ధానికి వినియోగిస్తోందని ఆయన పేర్కొన్నారు. కాబట్టి అలాంటి దేశంతో వాణిజ్యాన్ని భారత్ ముగించుకుంటే బాగుంటుందని హితవు పలికారు. న్యూఢిల్లీపై పెనాల్టీలు విధించాలని అమెరికా కోరుకోవడం లేదని క్రిస్ రైట్ స్పష్టం చేశారు. కేవలం యుద్ధాన్ని ముగించాలని మాత్రమే చూస్తున్నామని వెల్లడించారు. భారత్ తమ ఇంధన దిగుమతుల గురించి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించుకుటుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. న్యూఢిల్లీతో ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణ ఇంటర్ విద్యలో కీలక మార్పులు..

హైదరాబాద్, సెప్టెంబరు 25 : రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు తెలంగాణ ఇంటర్ బోర్డు శ్రీకారం చుట్టింది. భవిష్యత్ టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా, వచ్చే నవంబర్ నెల నుంచి ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పై తరగతులు ప్రారంభించనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి ప్రకటించారు. ఆధునిక సాంకేతిక విద్యను పాఠశాల స్థాయి నుంచే అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ సిలబస్‌తో పాటు పరీక్షల విధానంలో కూడా మార్పులు చేయనున్నట్లు బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులపై భారం తగ్గించి, నైపుణ్య ఆధారిత విద్యను ప్రోత్సహించడమే ఈ మార్పుల ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. మరోవైపు, ప్రభుత్వ జూనియర్ కాలేజీల పట్ల విద్యార్థుల ఆదరణ పెరుగుతోందని, గతేడాదితో పోలిస్తే ఈసారి అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అదే సమయంలో కాలేజీల్లో అధ్యాపకుల కొరతను నివారించేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టిందని బోర్డు కార్యదర్శి తెలిపారు. కొత్త పోస్టుల భర్తీకి ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని, తక్షణ అవసరాల నిమిత్తం త్వరలోనే 494 మంది గెస్ట్ లెక్చరర్లను నియమించనున్నట్లు వెల్లడించారు. ఇక విద్యార్థుల పురోగతి, బోధన నాణ్యత వంటి అంశాలపై తల్లిదండ్రులతో చర్చించేందుకు ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జూనియర్ కాలేజీలలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా, విద్యార్థులకు ఊరటనిచ్చే అంశంగా ఈ ఏడాది కూడా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో జంబ్లింగ్ విధానాన్ని అమలు చేయడం లేదని బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

## స్మితా సబర్వాల్ పై చర్యలు వద్దు.. హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబరు 25 : కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ కు హైకోర్టు ఊరటనిచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన విషయం విదితమే. ఈ నివేదికలో ఐఏఎస్ స్మితా సబర్వాల్ పేరును కూడా కమిషన్ పేర్కొంది. దీనిపై స్మితా సబర్వాల్ హైకోర్టును ఆశ్రయించారు. నోటీసుల జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని ఆమె న్యాయస్థానంలో సవాల్ చేశారు. కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తనపై తదుపరి చర్యలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్ ను విచారించిన హైకోర్టు.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా స్మితా సబర్వాల్ పై చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. ఇప్పటికే దాఖలైన పిటిషన్లతో కలిపి దీనిని విచారిస్తామని పేర్కొంది.

## అగ్నిప్రైమ్ ప్రయోగం సక్సెస్.. ఇక రైలు నుంచే శత్రువులకు గురి

ఢిల్లీ, సెప్టెంబరు 25 : భారత రక్షణ రంగం మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. దేశంలోనే మొట్టమొదటిసారిగా రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుంచి 'అగ్నిప్రైమ్' మధ్యంతర శ్రేణి క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఈ చారిత్రక ప్రయోగంతో, ఇలాంటి అత్యాధునిక సామర్థ్యం కలిగిన కొన్ని దేశాల సరసన భారత్ సగర్వంగా నిలిచింది. ఈ విషయాన్ని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం అధికారికంగా ప్రకటించారు. ఈ కొత్త తరం క్షిపణి దాదాపు 2,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగలదని, దీనిలో పలు అత్యాధునిక సాంకేతికతను పొందుపరిచారని ఆయన తెలిపారు. ప్రత్యేకంగా రూపొందించిన ఈ రైలు లాంచర్ వ్యవస్థ ద్వారా క్షిపణిని దేశంలోని రైల్వే నెట్‌వర్క్‌పై ఎక్కడికైనా అత్యంత వేగంగా తరలించవచ్చు. దీనివల్ల శత్రువుల నిఘాకు చిక్కకుండా, చాలా తక్కువ సమయంలో ప్రయోగానికి సిద్ధం చేసేందుకు వీలు కలుగుతుంది. దేశ రక్షణ సామర్థ్యాన్ని ఇది రెట్టింపు చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ అద్భుత విజయంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనతను సాధించిన రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ), వ్యూహాత్మక బలగాల కమాండ్ (ఎస్ఎఫ్‌సీ) శాస్త్రవేత్తలతో పాటు సాయుధ బలగాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యంలో భాగంగా రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా ఈ ప్రయోగం ఒక కీలక ముందడుగు అని ఆయన అభివర్ణించారు.

## తమిళనాడు ప్రభుత్వ ఆహ్వానం.. చెన్నైకి సీఎం రేవంత్ రెడ్డి

ఢిల్లీ, సెప్టెంబరు 25 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తున్నారు. వరుస పర్యటనలతో కాంగ్రెస్ పార్టీలో, ఇండియా కూటమిలో కీలక నేతగా ఎదుగుతున్నారు. తాజాగా ఆయన ఈరోజు చెన్నైలో పర్యటించనున్నారు. తమిళనాడు ప్రభుత్వం నిర్వహిస్తున్న "మహా విద్యా చైతన్య ఉత్సవ్" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ పర్యటన కోసం సీఎం రేవంత్ రెడ్డి ఈ మధ్యాహ్నం 1 గంటకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో చెన్నైకి బయలుదేరి వెళ్లనున్నారు. సాయంత్రం జరిగే ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని, ప్రసంగిస్తారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన తిరిగి హైదరాబాద్‌కు రానున్నారు. ఈ పర్యటనకు రాజకీయంగానూ ప్రాధాన్యత ఏర్పడింది. బీహార్ రాజధాని పాట్నాలో నిన్న జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆ సమావేశం ముగిసిన మరుసటి రోజే ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న డీఎంకే ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## దీని కోసం ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సిన అవసరంలేదు

ఇక నుంచి ప్రతి ఏడాది డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నిరుద్యోగులు, ఈ ఏడాది డీఎస్సీలో క్వాలిఫై కాని వారంతా ప్రిపేర్ అవుతూ ఉండాలని సూచించారు. ఇకపై క్రమం తప్పకుండా డీఎస్సీ నిర్వహిస్తామని... దాని కోసం ప్రత్యేకంగా అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని మంత్రి నారా లోకేశ్ కు సీఎం చంద్రబాబు చెప్పారు. మెగా డీఎస్సీలో విజేతలకు ఉపాధ్యాయ పోస్టుల నియామక పత్రాలను జారీ చేసే కార్యక్రమం గురువారం రాష్ట్ర సచివాలయం సమీపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన 15,941 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. అన్ని జిల్లాల నుంచి నియామక పత్రాలు అందుకునేందుకు కొత్తగా రిక్రూట్ అయిన టీచర్లు కుటుంబ సభ్యులతో సహా తరలి వచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."సీఎంగా బాధ్యతలు చేపట్టాక తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే పెట్టాను. అవినీతి లేకుండా పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ చేపట్టాం... టీచర్ల నియమించాం. 150 రోజుల్లో ఈ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టిన మంత్రి నారా లోకేశ్ బృందాన్ని అభినందిస్తున్నాను. ఇక టీచర్లుగా నియామక పత్రాలు తీసుకున్న ఉపాధ్యాయులను అభినందిస్తున్నాను. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా బాబు ష్యూరిటీ... జాబు గ్యారెంటీ అని చెప్పాను... దాన్ని నిజం చేస్తున్నాం. రూ. 10 లక్షల కోట్లు పెట్టుబడులకు ఎంఓయూలు కుదుర్చుకున్నాం.. 10 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయి. 15 ఏళ్లల్లో 14 సార్లు డీఎస్సీని పెట్టాం.. 1,96,619 ఉద్యోగాలిచ్చాం. ఇక పైనా ప్రతి ఏడాది డీఎస్సీ ఉంటుంది" అని సీఎం చెప్పారు.

### చదువు చెప్పడంలో మహిళలే బెస్ట్

"సూపర్ సిక్స్ హామీల్లో మొదటి హామీ యువతకు 20 లక్షల ఉద్యోగాలివ్వడమే. దాంట్లో భాగంగా మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశాను. మెగా డీఎస్సీని సూపర్ హిట్ చేశారు. ఉద్యోగం సంపాదించాలన్న మీ కోరిక తీరింది... పేదరికం లేని సమాజం చూడాలనేది నా కోరిక. పేదరికం లేని సమాజాన్ని చూడాలంటే... విద్యతోనే సాధ్యం.. దాన్ని టీచర్లే నెరవేర్చాలి. మగవాళ్లకంటే మహిళలే మంచిగా చదువు చెప్పగలరు. ఇంటిని కూడా మహిళలే చక్కగా తీర్చిదిద్దుతారు. అందుకే సంక్షేమ కార్యక్రమాలు అందించే విషయంలో మహిళలకే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నాం.

### * విద్యా రంగాన్ని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు...

తొలిసారిగా సీఎం అయినప్పటి నుంచి విద్య పైనే ఎక్కువ శ్రద్ధ పెట్టాను. ఐటీ చదవమని ఆ రోజుల్లో చాలా మందికి చెప్పాను... కొందరు నా మాటపై నమ్మకంతో పట్టణాలకు వచ్చి చదువుకున్నారు. ఆ రోజు చక్కగా చదువుకున్నవారు... ఇప్పుడు విదేశాలకు వెళ్లారు.. బాగా స్థిరపడ్డారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రులందరూ కలిసి ఎంత మంది టీచర్లను నియమించారో... నేను ఒక్కడినే అంత మంది టీచర్లను నియమించాను. ఇదీ నేను విద్యా రంగానికి ఇచ్చే ప్రాధాన్యత. విద్యా రంగాన్ని నేను ఎప్పుడూ అశ్రద్ధ చేయలేదు... నిర్లక్ష్యం చూపలేదు. టీచర్లుగా బాధ్యతలు తీసుకున్న మీరంతా బాగా పనిచేయాలి... మంచి పేరు తీసుకురావాలి. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేలా టీచర్లంతా పని చేయాలి.

### విలువలతో కూడిన విద్యనందించాలి

విలువలతో కూడిన విద్యను అందించేలా టీచర్లంతా పని చేయాలి. పిల్లల్లో నైతిక విలువలను పెంచేలా టీచర్లు పాఠాలు చెప్పాలి. పిల్లల్లో నైపుణ్యాలు పెంచే బాధ్యత టీచర్లు తీసుకోవాలి. భవిష్యత్తులో విద్యా రంగంలో ఎలాంటి మార్పులు రాబోతున్నాయోననేది టీచర్లు ఊహించగలగాలి. మారిన పరిస్థితులకు అనుగుణంగా టీచర్లు అప్డేట్ అవుతూ ఉండాలి. నేను నిత్య విద్యార్థిని... కొత్త విషయాలు నేర్చుకుంటాను.. ప్రజలకు ఉపయోగపడే అంశాలు ఉంటే వాటిని అమలు చేస్తాను. కూటమి ప్రభుత్వం వచ్చాకే విద్యా వ్యవస్థలో మార్పులు వచ్చాయి. నో అడ్మిషన్లు బోర్డులు పెట్టే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలను తెచ్చారు... ఇది మరింతగా పెరగాలి. విద్యా శాఖ కఠినంగా ఉంటుందని చెప్పాను.. అయినా లోకేశ్ ఛాలెంజ్ గా తీసుకున్నారు.

### మంచి చేయరు... చేస్తే ఓర్వలేరు

ఏపీలో ఓ చేతకాని ప్రతిపక్షం ఉంది. ఆ చేతకాని పక్షం మంచి చేయదు... మంచి జరుగుతుంటే ఓర్వలేదు. డీఎస్సీని అడ్డుకునేందుకు 106 కేసులు వేశారు. కానీ ఇబ్బందులను అధిగమించి డీఎస్సీ నిర్వహించారు. పోస్టింగుల కోసం పైరవీలు చేసే పరిస్థితి గతంలో ఉండేది. కానీ టీడీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ ప్రతిభ ఆధారంగానే పోస్టింగులు ఇచ్చాం. 2019-24 మధ్య కాలం విద్యా వ్యవస్థకు ఓ శాపం. 10 లక్షల మంది పిల్లలు గత పాలకుల హయాంలో ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లిపోయారు. ఏపీ విద్యా రంగాన్ని 19వ స్థానానికి దిగజార్చారు. ఇంగ్లిష్ మీడియం పేరుతో ప్రాథమిక విద్యా వ్యవస్థను నాశనం చేశారు. తెలుగు మీడియంను రద్దు చేశారు. ఇంగ్లిష్ మీడియం అంటూ కొందరిని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. రాజకీయాల కోసం విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారు.

### టీచర్లతో ముఖాముఖి

గతంలో జరిగిన కార్యక్రమాలన్నింటికంటే భిన్నంగా జరిగిన ఈ సభలో కొత్తగా నియమితులైన టీచర్లతో సీఎం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తనను రాజకీయాల్లో ప్రోత్సహించిన ఎకనామిక్స్ ప్రొఫెసర్ డీఎల్ నారాయణను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. పిల్లలను ప్రోత్సహిస్తే.. ఎంతటి కష్టమైన పనిని అయినా... సులభంగా సాధిస్తారని సీఎం చెప్పారు.

## తెలంగాణలో భారీ వర్షా లు.. కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

రానున్న రెండు రోజుల్లో తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆయన కీలక సూచనలు జారీ చేశారు. కలెక్టర్లు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. అవసరమైతే ఆయా చోట్ల లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను ముందుగానే ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న సమయంలో విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, అలాగే ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కాగా, ఈ రోజు, రేపు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.



# ముగిసిన సిపిఐ 25వ జాతీయ మహాసభలు

*** జాతీయ కార్యవర్గ సభ్యులుగా మరోసారి కూనంనేని ఎన్నిక**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : ఐదు రోజులపాటు పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్ లో జరిగిన సిపిఐ 25వ జాతీయ మహాసభలు గురువారంతో ముగిశాయి. ఈ మహాసభకు భద్రాద్రి జిల్లా నుంచి తొమ్మిదిమంది ప్రతినిధులుగా పాల్గొన్నారు. గురువారం జరిగిన జాతీయ సమితి ఎన్నికల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే, కొత్తగూడెంకు చెందిన కూనంనేని సాంబశివరావు జాతీయ కార్యవర్గ సభ్యులుగా తిరిగి ఎన్నికయ్యారు. జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషాకి తొలిసారిగా జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికయ్యారు. జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన కూనంనేని ఐదు దశాబ్దాలుగా సీపీఐలో కీలకపాత్ర పోషిస్తున్నారు. 2005 నుంచి 2009 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా





పనిచేశారు. 2009లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిశారు. తిరిగి 2023లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి ఎన్నికై ప్రస్తుతం ఎమ్మెల్యేగా, రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని కొనసాగుతున్నారు. జాతీయ సమితి సభ్యులుగా తొలిసారిగా ఎన్నికైన సాబీర్ పాషా విద్యార్థి దశ నుండి కమ్యూనిస్టు పార్టీలో చురుకైన పాత్ర పోషించి యువజన నాయకునిగా, కార్మిక ఉద్యమాల్లో తనదైన భూమిక పోషించారు. 1995లో ఏఐఎస్ఎఫ్ కొత్తగూడెం కార్యదర్శిగా పనిచేస్తూ సిపిఐ సభ్యత్వం తీసుకున్నారు. ఏడు సవత్సరాలపాటు విద్యార్థి విభాగం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శిగా విధులు నిర్వహించారు. 2001లో ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి ఏపి రాష్ట్రకార్యదర్శిగా బాధ్యలు చేపట్టారు. పార్టీ అవసరాల నిమిత్తం 2002 కొత్తగూడెం పట్టణ సిపిఐ కార్యదర్శిగా ఎంపికయ్యారు. 2005 నుండి 2010 వరకు కొత్తగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన 2009 2017 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శిగా పనిచేసిన ఆయన జిల్లా ఏర్పడిన నాటి నుంచి కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అయన జాతీయ సమితిసభ్యులుగా ఎంపికకావడం పట్ల పలువురు హర్యంవ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ చిన్ననాటి నుండి వామపక్ష భావాజాలంతో పెరిగిన తనను పార్టీ గుర్తించిందని, తనపై పెట్టిన పెద్ద బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ పురోభివృద్ధి కృషి చేయనున్నట్లు తెలిపారు.

## అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

*** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం చర్లపల్లి డివిజన్ లో అమ్మవారి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాలని వాసులు తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట సీఐ కార్యాలయం సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

*** గ్రేవ్ కేసుల్లో నిందితులకు ఖచ్చితంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి**






ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం అశ్వారావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. ముందుగా కార్యాలయ పరిసరాలను పరిశీలించి, అనంతరం అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. కోడిపందాలు, పేకాట, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అంతర్రాష్ట్ర దొంగల ముఠాల కదలికలపై నిఘా పెంచి దొంగతనాలను అరికట్టాలి. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం చూపాలన్నారు. గ్రేవ్ కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా బాధ్యతతో పనిచేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతం కావడంతో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి, ఎస్సైలు యాయాతి రాజు, అఖిల, దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: స్వచ్ఛత అనేది ఒక్కరోజు జరిపే కార్యక్రమం కాదని, ప్రతి పౌరుడి నిరంతర బాధ్యత అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. పరిశుభ్రత అలవాటు సమాజంలో నిత్యకృత్యంగా కొనసాగితేనే ఆరోగ్యవంతమైన, పచ్చదనం కలిగిన వాతావరణం ఏర్పడుతుందని ఆయన స్పష్టం చేశారు. భారత ప్రధాని పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శ్రమదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌తో పాటు అదనపు కలెక్టర్ విద్యా చందన, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పరిశుభ్రతా కార్యక్రమంలో గడ్డి, పిచ్చిమొక్కలను తొలగిస్తూ అందరూ శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద చెత్తను వేర్వేరు డబ్బాలలో వేసి సక్రమంగా పారవేయాలి. ప్లాస్టిక్‌ను ఎక్కడ పడితే అక్కడ పడేయరాదు. మురుగులో చెత్త వేయడం వల్ల దోమల పెరుగుదల, వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. ఆరోగ్యకరమైన జీవనం కోసం పరిశుభ్రమైన వాతావరణం తప్పనిసరి అని ఆయన హితవు పలికారు. యువత, విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. చివరగా పాల్గొన్నవారు అందరూ స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. జడ్పీ సీఈవో నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఏడి మైన్స్ దినేష్, గ్రౌండ్ వాటర్ ఏడి రమేష్, మెప్మా పీడీ రాజేష్, జిల్లా ఉద్యోగులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి రైల్వే టెర్మినల్
## రవాణా సౌకర్యాల కోసం సిపిఎం ధర్నా

ప్రజాస్ఫూర్తి, కాప్రా : చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం డిమాండ్ చేశారు. గురువారం మేడ్చల్ జిల్లా చర్లపల్లి రైల్వే స్టేషన్ టెర్మినల్ వద్ద సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ ధర్నాకు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మేడ్చల్ జిల్లా సిపిఎం కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ.. సుమారు 480 కోట్ల వ్యయంతో నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రధాని జనవరిలో ప్రారంభించారని గుర్తుచేశారు. అయితే ఇప్పటికీ ఆ టెర్మినల్‌కు తగిన రహదారి కనెక్టివిటీ, ప్రజా రవాణా సౌకర్యాలు లేని కారణంగా ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైలు టికెట్ ధర కంటే స్టేషన్‌కి చేరుకునే ఖర్చు ఎక్కువ అవుతోంది అని ఎద్దేవా చేశారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి పలక్‌నామా, లింగంపల్లి, కాచిగూడ, సికింద్రాబాద్, మేడ్చల్ ప్రాంతాలకు ఎంఎంటీఎస్ రైళ్లు నడిపేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఘట్కేసర్, లింగంపల్లి నుండి ఒక్కో ట్రిప్ మాత్రమే నడపడం, ప్రజా రవాణా డొల్లతనానికి నిదర్శనమని అన్నారు. ఎంఎంటీఎస్ రాకపోకలకు ఉన్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైల్వే అధికారులను కోరారు. అలాగే, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని, రైలు స్టేషన్ సమయాలకు సరిపడేలా ఆర్ టి సి బస్సులను నడపాలని డిమాండ్ చేశారు. మెట్రో రైలు విస్తరణ పనులు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరగా ప్రారంభించాలని పిలుపునిచ్చారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ కనెక్టివిటీ మెరుగుపడేందుకు రహదారి విస్తరణ




అత్యవసరమని ఆయన సూచించారు. అనంతరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, ఎం.వినోద లు భారతీయ రైల్వేను ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా పనిచేస్తోందని ఆరోపించారు. ప్రైవేటీకరణ పేరుతో ఇప్పటి వరకు ఒక్క కొత్త లైన్ కూడా నిర్మించలేదని, పాత లైన్లపైనే ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని విమర్శించారు. అనంతరం రైల్వే అధికారులకు సిపిఎం పార్టీ బృందం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.శంకర్, ఎన్.సబితా, సీనియర్ నాయకులు జి.యాదగిరి రావు, శ్రీమన్నారాయణ, సోమయ్యచారి, శరత్, పి.గణేష్, ఎమ్మెస్ రావు, సఫియా సుల్తానా, దుర్గయ్య, జీవీరావు, సిహెచ్.లీలావతి, బి.నరసింగరావు, డి.ప్రభాకర్, సిహెచ్.అశోక్, మణికంఠ, టి.నరసింహ, ఆదామ్, రవీందర్ రెడ్డి తదితర పార్టీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి



జిన్నారం, ప్రజాస్ఫూర్తి 25: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు జగన్ రెడ్డి ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన చూపిన అంత్యోదయ పథకాన్ని అమలుపరుస్తూ అడుగుజాడలలో నడుస్తూ దేశానికి ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త కంకణ భక్తుడై పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని మండల పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వంగేటి ప్రతాప్ రెడ్డి, కురుపల్లి నర్సింగరావు, శంషాబాద్ రాజు, పూడూరు సుధాకర్, కమ్మరి కృష్ణ, దేవేందర్, మద్దూరి రాజు, అశోక్ వెంకటేష్,రాజు, రాము,బాలయ్య, నాగేష్, ప్రభాకర్, ఎల్లేష్, రాము,వీరేష్, అశోక్, నర్సింగ్ రావు సీతరాజు, ఇంకా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుషాయిగూడలో సుందరీకరణ పనులు త్వరలో ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడలోని డా. బీఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావ్ ఫులే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల చుట్టూ సుందరీకరణ పనులను దసరా తర్వాత ప్రారంభిస్తామని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆమెను సన్మానించారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

*** మాజీ ఎంపిటిసి బాలయ్య...**
*** కన్ సాన్ పల్లిలో స్వచ్ఛత హీసేవ కార్యక్రమం...**



అందోలు, ప్రజాస్ఫూర్తి: ప్రతి ఒక్కరూ ఇళ్లతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మాజీ ఎంపిటిసి తలారి బాలయ్య అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటు చీపురు పట్టి చెత్తచెదారాన్ని ఉడ్చివేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు జీవనవిధానంలో భాగస్వామ్యం కావాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉండగలమని, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మొరబోయిన కృష్ణ ముదిరాజ్, గ్రామ పార్టీ అధ్యక్షులు చిలుకంటి వీరన్న, గ్రామ కార్యదర్శి నాగరాజు, నాయకులు రమేష్ గౌడ్, ఎం.ఈశ్వరయ్య,వని దుర్గయ్య, మహిళా సమాఖ్య గ్రామ అధ్యక్షురాలు వరలక్ష్మితో పాటు గ్రామపంచాయతీ కార్మిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టెక్స్ టైల్ పార్కులో ఉత్పత్తి ధరకే విక్రయాలు.. అభినందనీయం

*** చేనేత జౌళి శాఖ ఏడి అన్నదేవర శ్రీనివాసరావు**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: టెక్స్ టైల్ పార్కులో వస్త్రాలను, దుస్తులను ఉత్పత్తి ధరకే వినియోగదారులకు అమ్మడం అభినందనీయమని చేనేత జౌళి శాఖ ఏడి అన్నదేవర శ్రీనివాసరావు అన్నారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం లోని టెక్స్ టైల్ పార్కు సాధారణ సదుపాయాల కేంద్రం (సి. ఎఫ్. సి)లో విక్రయ కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం 50ఎకరాల విస్తీర్ణంలో టెక్స్ టైల్ పార్కును ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో



తయారుచేసిన వస్త్రాలు, దుస్తులు, ఫ్యాషన్ ఉత్పత్తులు లాభం లేకుండా ఉత్పత్తి చేసిన ధరకే వినియోగదారులకు అమ్మడానికి ఈ కేంద్రాన్ని ప్రారంభించారన్నారు. ఈ పార్కులో స్థలాలు పొందిన వారు తమ యూనిట్లను ప్రారంభించినట్లయితే మరింత మందికి ఇక్కడ ఉపాధి లభిస్తుందన్నారు. చుట్టుపక్కల గ్రామాల మహిళలు ఉపాధి పొందేందుకు ఈ ప్రాంగణంలోనే కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తామన్నారు. టి. జి. ఐ. ఐ. సి. డిప్యూటీ జనరల్ మేనేజర్ భవాని మాట్లాడుతూ టెక్స్ టైల్ పార్కు నిర్వహణ బాధ్యతలను తమ సంస్థకు అప్పగించినట్లయితే తమ నిబంధనలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, తెలంగాణ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం. గోపాలరావు, టెక్స్ టైల్ పార్కు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు విజయ్ కుమార్, టీజీ ఐఐసీ ఐలా సర్వీస్ కమిటీ చైర్మన్ ఎం. కే. డి. ప్రసాద్, పరిశ్రమల నిర్వాహకులు కే.కృష్ణమూర్తి, వేణు, రీజీమా, చిట్టిబాబు, శ్రవణ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దసరా సెలవులకు ఊళ్లకు వెళ్ళే వారు అప్రమత్తంగా ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

*** బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : దసరా సెలవులకు ఊళ్లకు వెళ్ళే వారు అప్రమత్తంగా ఉండి, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి అన్నారు. రానున్న దసరా, బతుకమ్మ పండుగలకు పిల్లలకు సెలవులుండటంతో చాలా మంది ప్రయాణాలు చేస్తుంటారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు. సైబరాబాద్ కమీషనరేట్ పరధిలోని బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. దసరా పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, ప్రజలను కూడా అప్రమత్తం చేస్తున్నమన్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ విషయంలో బాలానగర్ డివిజన్ అన్ని పోలీస్ స్టేషన్ లా పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్బంగా ఏసీపీ రెడ్డి ప్రజలకు పలు సూచనలు చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ లో పోలీసులు నిఘానేత్రం కింద ప్రజలు, కార్పొరేట్ కంపెనీల సీఎస్ఆర్ సహకారంతో ఇప్పటికే సీసీటీవీ లను ఇన్ స్టాల్ చేశారు. తద్వారా ఎన్నో సంచలనాత్మక నేరాలను చేదించామని, ప్రజలు కూడా తమ కాలనీలు, ఇళ్లు, పరిసరాలలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటివారికి ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలని, విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కారులలో పెట్టడం చేయరాదన్నారు. ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలుపరాదన్నారు. బీరువా, లాకర్ తాళాలను ఇంట్లో ఉంచరాదు, తమతోపాటే తీసుకెళ్తే మంచిదన్నారు. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ తో మూసివేయాలన్నారు. గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలన్నారు. ఎక్కువ రోజులు విహారయాత్రల్లో ఉంటే పేపర్,




పాల వారిని రావద్దని చెప్పాలి. పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలన్నారు. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదని తెలిపారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదా ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలన్నారు. టైమర్‌తో కూడిన లైట్లను ఇంట్లో అమర్చుకోవాలన్నారు. రద్దీగా ఉన్న బస్సులలో ప్రయాణిస్తున్నప్పుడు, తమ విలువైన వస్తువులను తమ వద్ద జాగ్రత్త పరుచుకోవాలన్నారు. బ్యాగుల్లో బంగారు నగలు డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు దగ్గరలో పెట్టుకోవాలి. బ్యాగు బస్సులో పెట్టి కిందికి దిగితే దొంగలు అపహరిస్తారన్నారు. ఇంటి డోర్‌కు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోవడం సురక్షితమన్నారు. హోమ్ సెక్యూరిటీ సిస్టం ద్వారా ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న మీ మొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచి అయినా లైవ్/ప్రత్యక్షంగా చూసుకునే వీలుంది. ఇంటికి సంబంధించిన నాణ్యమైన సిసిటివి లు (షాయోమీ వంటి కంపెనీలు తక్కువ ధరకే) ఆన్లైన్/మార్కెట్ లో అందుబాటులో ఉన్నాయి. హోమ్ సెక్యూరిటీ సర్వెలెన్స్ కు ఇవి ఎంతో ఉపయుక్తమన్నారు. ఇంటి భద్రతాపరంగా ఇంటికి దృఢమైన, నాణ్యమైన తలుపులతో పాటు హై ఎండ్ గోద్రెజ్ హై సెక్యూరిటీ లాక్ సిస్టం ని వాడడం మంచిదన్నారు. తాళం వేయడం కంటే గోద్రెజ్ డోర్ లాక్ చేయడం వల్ల ఇంట్లో మనుషులు ఉన్నారా? లేరా? అనేది తెలియదన్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు చుట్టు పక్కల వారికి లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. నమ్మకమైన సెక్యూరిటీ గార్డులను, వాచ్ మెన్ ను నియమించుకోవాలి. కాలనీవాళ్లు కమిటీలు వేసుకొని వాచ్‌మెన్లను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకకోవాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు తెలపాలి. దీంతో వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊర్లెల్లిన వారి ఇళ్లపై నిఘాను ఏర్పాటు చేస్తామని ఏసీపీ నరేష్ రెడ్డి తెలిపారు. కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ లేదా సైబరాబాద్ పోలీసు వాట్సాప్ నెంబర్ 9490617444 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## లలిత త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు...

*** ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం...**



అందోలు, ప్రజాస్ఫూర్తి: దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామంలో దుర్గా భవానీ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో అమ్మవారికి లలిత త్రిపుర సుందరి అవతారంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలపల్లి దాసు దంపతులు అమ్మవారి పూజల్లో పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి మూల విగ్రహానికి ఏమిటి అభిషేకం నిర్వహించడంతోపాటు కుంకుమార్చన, గణపతి పూజలను నిర్వహించారు. చిలకపచ్చ రంగు చీరతో అమ్మవారిని అలంకరించడంతోపాటు పెరుగన్నం, గారెలు, చక్కెర పొంగలు, పులిహోరను నైవేద్యంగా సమర్పించి హారతులు ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఐడిఓసి లో అంగరంగ వైభవంగా అట్ల బతుకమ్మ సంబరాలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: దసరా వేడుకలలో భాగంగా ఐదవ రోజైన అట్ల బతుకమ్మ ఉత్సవాలను గురువారం ఐడిఓసి కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ, సివిల్ సప్లై శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో కార్యాలయం ఆవరణ బతుకమ్మ పాటలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. మహిళా ఉద్యోగులు సంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మలను అలంకరించి, భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, బతుకమ్మ చుట్టూ నృత్యాలు చేశారు. అట్ల బతుకమ్మ ప్రత్యేకతగా పిండివంటలు, అట్లతో తయారుచేసిన బతుకమ్మ అందరినీ ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక. ఈ పూల పండుగను తరతరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిదే అని అన్నారు. ఇలాంటి పండుగలు మహిళల ఐక్యతకు, సాంప్రదాయాల పరిరక్షణకు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, తహసీల్దార్లు గన్యా, భగవాన్ రెడ్డి, స్వర్ణలత, స్వాతి బిందు, ఐడిఓసి అధికారులు, ఉద్యోగులు, సహకార సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో సీనియర్ పాత్రికేయుడు సురేష్ మృతి



మల్కాజిగిరి, (ప్రజాస్ఫూర్తి) : సీనియర్ పాత్రికేయుడు మందే సురేష్ గుండె పోటుతో హఠాన్మరణం చెందారు. గత 20 ఏళ్ళుగా పత్రికా రంగంలో మల్కాజిగిరి ప్రాంత విలేఖరిగా పని చేశారు. గత కొన్ని నెలల క్రితం కాలు విరిగి కొలుకుంటున్నక్రమంలో గురువారం సాయంత్రం గుండెపోటు రావడంతో మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ నాయకులు సంతాపం తెలిపి వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు.



## కోట్లాది రూపాయల నిధులతో నిజాంపేట్ లో మౌలిక వసతులు కల్పించాం

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్ , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : గత పదకొండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ డివిజన్లు, కాలనీలలో మౌలిక వసతులు కల్పించామని బిఆర్ఎస్ ఎల్పీ విప్ , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లు, కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి .వివేకానంద్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజీరా నీటి నిర్వహణ, బిల్లులు, వీధి దీపాల నిర్వహణ, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజ్, చెరువుల అభివృద్ధి, వర్షపు నీటి కాలనీలలో నిలిచిపోవడం, నత్త నడకన సాగుతున్న బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదకొండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ డివిజన్లు, కాలనీలలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, మంజీరా నీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటుతో పాటు చెరువుల పునరుద్ధరణకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తున్నామన్నారు. బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతేకాక మౌలిక వసతుల కల్పనలో భాగంగా టెండర్లు పూర్తయిన పనులను త్వరగా ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, ప్రగతి నగర్, నిజాంపేట్ ప్రాంతాలలోని అన్నీ కాలనీలలో శానిటేషన్ నిర్వహణ సరిగాలేదని, శానిటేషన్ నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు.. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ డివిజన్లలో పెరుగుతున్న దోమల వ్యాప్తిని నివారించేందుకు ఫాగింగ్ ను విధిగా నిర్వహించాలన్నారు. చెరువుల సుందరీకరణలో భాగంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిది చెరువులకు 22 కోట్లు, ఐదు పార్కుల అభివృద్ధికి 10 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందని ఈ పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, ఎమ్మార్వో పూల్ సింగ్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పవిత్రమైన జర్నలిజం వృత్తిని పరిరక్షించేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది

*** టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ**

హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : పవిత్రమైన జర్నలిజం వృత్తిని పరిరక్షించేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ అన్నారు. టీయూడబ్ల్యూజే సంఘం కార్యకలాపాలకు ఆకర్షితులై, మహబూబ్ నగర్ జిల్లాలో ప్రధాన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న పలువురు జర్నలిస్టులు గురువారం బషీర్ బాగ్ లోని యూనియన్ కార్యాలయానికి తరలివచ్చి విరాహత్ అలీ సమక్షంలో యూనియన్ సభ్యత్వాలు తీసుకున్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దాదాపు డెబ్బై యేండ్ల సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగివుండి, రాష్ట్రంలో వేలాది జర్నలిస్టుల విశ్వాసం చూరగొంటున్న ఘనత దేశంలో తమ సంఘానికి మాత్రమే దక్కిందని స్పష్టం చేసారు. ఐక్యత, పోరాటాలు, త్యాగాల పునాదులపై తమ సంఘం నిర్మితమైందన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టుల పేరుతో లెటర్ హెడ్ లు, విజిటింగ్ కార్డులు సృష్టించి, పైరవీలు చేసుకుంటూ పబ్బం గడుపుకునే సంఘాలను జర్నలిస్టులు గుర్తించి, వారిని తిరస్కరిస్తూ, తమ సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న టీయూడబ్ల్యూజేఐజేయు సంఘం జెండా పట్టుకొని కదం తొక్కుతున్నట్లు విరాహత్ అలీ అన్నారు. కొన్ని అరాచక శక్తుల చర్యల మూలంగా ప్రస్తుతం మీడియా భవిష్యత్తు ప్రశ్నర్థకంగా మారిందని,. పాలమూరు జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టుల ఉద్యమాన్ని విస్తరింపజేయడంలో తమ సంఘం దివంగత నేతలు రఘురామయ్య, హన్మంత్ రెడ్డిల కృషి చిరస్మరనీయమన్నారు. జిల్లాల విభజనకు ముందు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మొత్తంలో తమ సంఘం సభ్యత్వాలు 400వరకు ఉంటే, జిల్లాల విభజన తర్వాత దాదాపు 1400కు చేరడం బట్టి చూస్తే తమ సంఘం పట్ల జర్నలిస్టులకు ఉన్న విశ్వాసాన్ని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని విరాహత్ తెలిపారు. 31జిల్లాల్లో తమ సంఘానికి ఇలాంటి ఆదరణే ఉందని ఆయన స్పష్టం చేసారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వరకాల యాదగిరి, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. రాజేష్, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్, మహబూబ్ నగర్ జిల్లా నాయకులు విజయరాజు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 27, 28 తేదీలలో జిల్లా వ్యాప్తంగా భగత్ సింగ్ జయంతి ఉత్సవాలు

*** ఏఐఎస్ఎఫ్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవకారుడు షాహిద్ భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా, సెప్టెంబర్ 27, 28 తేదీలలో జిల్లా వ్యాప్తంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్కే షాహిద్, కార్యదర్శి వరక అజిత్ పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ అందరికీ విద్య, ఉపాధి కోసం ఉద్యమిద్దామన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదామన్నారు. భగత్ సింగ్ ఆశయాలు నేటి యువతలో స్ఫూర్తి నింపాలన్నారు. ఆయన త్యాగాలు పాఠ్యపుస్తకాలలో చోటు చేసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. భగత్ సింగ్ జయంతిని అధికారిక దినోత్సవంగా గుర్తించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలన్నారు. వారు భగత్ సింగ్ జీవిత చరిత్రను గ్రామాలు, పల్లెల్లో ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, ఇనపెల్లి పవన్, సాయి వినయ్, జిల్లా ఉపాధ్యక్షుడు సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జై జవాన్ కాలనీలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని జై జవాన్ కాలనీలో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని డివిజన్ ఏఈ రామకృష్ణ తెలిపారు. గురువారం విద్యుత్ లైన్ మెన్ పూర్ణచందర్ రెడ్డి తో కలిసి కాలనీలో పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్, సీనియర్ నాయకులు ఆలూరయ్య తదితరులు జై జవాన్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ అధికారులను కోరారు. దీంతో స్పందించిన అధికారులు కాలనీలో పర్యటించారు. కాలనీలో సింగిల్ ఫేస్ విద్యుత్ కనెక్షన్ల స్థానంలో త్రీ ఫేస్ కనెక్షన్లు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు కాలనీ సంక్షేమ సంఘం నాయకుడు ఎస్ఎం సాహెబ్ తెలిపారు. అదేవిధంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం అధికారులు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఎస్ కె. సలీం జిఎస్ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెంలో మద్యం షాపుల లాటరీ డ్రా



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నూతన మద్యం విధానం 2025-2027 లో భాగంగా జిల్లా పరిధిలోని 88 ఏ4 మద్యం షాపులకు కేటాయింపులు చేపట్టారు.44 షాపులు ఏజెన్సీ ఎస్టీలకు కేటాయించగా మిగతా 44 షాపులు కుల ప్రాతిపదికన కేటాయించబడ్డాయి. ఎస్సీలకు - 7 షాపులు,గౌడ్‌లకు - 6 షాపులు,ఓపెన్ ఫర్ ఆల్ - 31 షాపులు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్, తెలంగాణ, హైదరాబాద్ ఆదేశాల మేరకు, గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో లాటరీ డ్రా నిర్వహించారు.

# ఓయో పేరుతో కొనసాగుతున్న అసాంఘిక కార్యకలాపాలను నిలిపి వేయాలి

*** కాలనీ వాసుల డిమాండ్**

మేడ్చల్, (ప్రజాస్ఫూర్తి) : సంస్కృతి టౌన్షిప్ ఏరియాలో గేటెడ్ కమ్యూనిటీ కాలనీలోని రెసిడెన్షియల్ ఏరియా లలో ఓయో పేరుతో కొనసాగుతున్న అసాంఘిక కార్యకలాపాలను నిలిపి వేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. కూకట్ పల్లి ప్రాంతానికి చెందిన బ్యాంకు ఉద్యోగి అవ్వూరి అరుణ, భర్త ఏపీలో జెనో అధికారి ఎన్.మోహన్ రావు లు పరిధిలోని సంస్కృతి టౌన్ షిప్ ఏరియాలో 2 భవనాలను నిర్మించారు. ఇందులో ఒక భవనాన్ని పలు కుటుంబాలకు అద్దె ఇవ్వగా, మరో భవనాన్ని ఇంటినంబర్ 13 10/75లో కాలేజీ విద్యార్థుల హాస్టల్ నిర్వహణ కోసం మూడేళ్ల అగ్రిమెంట్తో ఏపీకి చెందిన వారి బంధువులకు అద్దెకు ఇచ్చారు. సదరు వ్యక్తులు ఆరు నెలలు హాస్టల్ నిర్వహణకు వినియోగించారు. ఈ తర్వాత మూడు నెలల నుంచి ఓయో నిర్వహిస్తున్నారు. . పోచారం మున్సిపాలిటీ రెండు నెలల పాటు వెంకటేశం అనే వ్యక్తి ఏలాంటి ,అనుమతులు ,నిబంధనలు పాటించ కుండానే.. ఓయోలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించారు. పలు సందర్భాల్లో స్థానికులు ఓయోలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాల విషయాన్ని ఇంటి యజమాని అరుణతో సహా నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లి ఓయోను ఇక్కడి నుంచి తరలించాలని, లేదా మూసి వేయాలని స్థానికులు కోరారు. ఓనరు అరుణ లీజుకిచ్చిన బంధువుల( నగరంలో బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాలేజీ బాలురు, బాలికల హాస్టళ్లు నిర్వహిస్తున్న వారు)తో కలిసి కాకతీయ గ్రాండ్ హోటల్ పేరుతో ఓయోను సెప్టెంబర్లో లో మళ్లీ అధికారింగా ప్రారంభించారు. ఈ సారి హైదరాబాద్ నగరంలో నివసించే నార్త్ ఇండియన్కు చెందిన రిసెప్షన్లను ఉద్యోగులుగా నియమించి సీసీ కెమెరాలను అమర్చి.. ఓయోను నిర్వహిస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో రెసిడెన్షియల్ భవనంగా నిర్మించిన ఇంటిలో వ్యాపార కార్యకలాపాలుగా కాకతీయ గ్రాండ్ హోటల్ పేరుతో ఓయో నిర్వహిస్తూ అసాంఘిక కార్యకలాపాలను చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇందులోకి హైదరాబాద్ నగరంతోసహా శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న నార్త్ ఇండియన్కు చెందిన అమ్మాయిలతో సహా వివిధ నిర్మాణ



ఇతర సంస్థల్లో పని చేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలు, బాలికలతో సహా తమ కాలేజీ హాస్టళ్లకు చెందిన పలువురు విద్యార్థులను ఓయోకు తరలించి.. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారమన్నారు. పెండ్లి కాని యువతీ, యువకులు, కాలేజీ విద్యార్థులు ఓయో తరలించటంతోపాటు వారితో అసాంఘిక కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు అనుమానం వస్తోందన్నారు. ఈ ఓయోలో బర్త్ డే పార్టీలతోసహా ఇతరతర పార్టీలు జరుగుతున్నాయని, ఈ పార్టీల్లో మద్యం, డ్రగ్స్ వంటి పదార్థాలను వినియోగిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. పార్టీల సందర్భంగా రాత్రి, పగటి వేళల్లో స్థానిక కాలనీ వాసులకు ముఖ్యంగా సమీపంలో ఉన్న ప్రైవేట్ హైస్కూల్ విద్యార్థులతోసహా వారిని తరలించే తల్లిదండ్రులకు తీవ్ర అంతరాయం కలుగుతోందని స్థానికులు వాపోతున్నారు. ఓయో నిర్వహిస్తున్న ఇళ్లు పూర్తిగా రెసిడెన్షియల్ కావటంతో .. పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. ఈ ఓయోకు ఏలాంటి పార్కింగ్ స్థలం లేకపోవటంతో రోడ్డు పైన్నే వాహనాలను పార్కింగ్ చేయటం వల్ల... ప్రైవేట్ హైస్కూల్కు విద్యార్థులను వాహనాల్లో తీసుకొచ్చే వారి తల్లిదండ్రులకు కాలనీ వాసులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కొన్ని సందర్భాల్లో ఓయోకు వచ్చిన వారికి స్కూల్ కాలనీ ప్రాంతానికి వెళ్లే వారి మధ్య ఘర్షణలు జరిగిన సందర్భాలు కూడా జరిగాయి. దీంతో పక్కన నివసించే కాలనీ వాసులకు కూడా తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. సమీపంలో ఉన్న ఎస్టీ కాలనీ వాసులతోపాటు వివిధ పనులకు కోసం వెళ్లుతున్న మహిళా ఉద్యోగులు కార్మికులకు కూడా తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ ఓయో వల్ల స్థానికులు, కాలనీ వాసులకు ఎదురవుతున్న ఇబ్బందులను చష్టిలో పెట్టుకోవటంతోపాటు అందులో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు. మద్యం, డ్రగ్స్ వినియోగం వంటి విషయాలపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించాలని కోరుతున్నారు. కాలనీ వాసులకు ఏలాంటి ఇబ్బందులు జరగకుండా ఓయోను ఇక్కడి నుంచి తరలించాలని వేడుకుంటున్నాం. రెసిడెన్సియల్ భవనంలో వ్యాపార కార్యకలాపాలుగా కాకతీయ గ్రాండ్ హోటల్ పేరుతో ఓయోలో అసాంఘిక కార్యకలపాలు నిర్వహిస్తున్న సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## వరద ముంపుకు గురయ్యే ప్రాంతాలను కాపాడాలి

*** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ వినతి**



జీడిమెట్ల , (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కొంపల్లి మున్సిపాలిటీ లో మొగుళ్ళ కుంట చెరువు నుండి ఊర చెరువు నుండి పాక్ సాగర్ కి నాళా లేకపోవడంతో కురిసిన వర్షానికి పరిసరప్రాంతాలు ముంపునకు గురై ప్రజలు తీవ్రయిబ్బందులు పడుతున్నారని గురువారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపర్ణ పార్క్, గణనంద, ఆదిత్య పార్క్, నూజివీడు సీడ్స్ మరియు పరిసర ప్రాంతాల సమస్యను అతిత్వరగా పరిష్కరించాలని కోరారు. అలాగే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో నెలకొన్న పలు సమస్యలను కూడ పరిష్కరించాలన్నారు. దీంతోస్పందించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జరిచేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తో పాటు కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ భారం కాదు.. బాధ్యత

*** చౌటుప్పల్ సిఐ మన్మథ కుమార్**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సీనియర్ సిటిజన్స్ వారి పిల్లలకు భారం కాదని.. కాపాడుకోవాల్సిన బాధ్యత అని గుర్తించాలని చౌటుప్పల్ సిఐ మన్మథ కుమార్ అన్నారు. రాచకొండ కమీషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ల ఆధ్వర్యంలో రాచకొండ సీపీ ఆదేశాల మేరకు గోల్డెన్ కేర్ కార్యక్రమాన్ని చౌటుప్పల్ లో గురువారం నిర్వహించారు. గోల్డెన్ కేర్ లో భాగంగా కేర్ ఫర్, దోస్ ఊ కేర్డ్ అస్, అనే టాగ్ లైన్ తో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పేదవారైనా సీనియర్ సిటిజన్స్ కు సీఐ మన్మథకుమార్ చేతుల మీదుగా ఓల్డ్ ఏజ్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ అనుభవాలను తెలుసుకోవాలన్నారు. భవిష్యత్తులో వారి అనుభవాలే దారి చూపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కె యాదగిరి, డి. నర్సిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హంస వాహనంపై సరస్వతీదేవిగా అభయమిచ్చిన శ్రీ మలయప్పస్వామి

కలియుగ ప్రత్యక్షదైవం, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు తిరుమల్లో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. విద్యుత్ వెలుగుల్లో స్వామివారు వాహనాలపై తిరుమాఢ వీధుల్లో విహరిస్తూ.. అభయమిస్తోంటే.. భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ.. అడుగడుగునా హారతులు పడుతున్నారు. భక్తుల నామస్మరణతో తిరుమల గిరులు మారు మ్రోగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ శ్రీ మలయప్పస్వామివారి హంస వాహనంపై సరస్వతిదేవి అలంకరణలో విహరిస్తూ.. భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఊరేగింపు ముందు పడతుల కోలాటాలు, సీతారాముల వేషధారణలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

## మహిళలు పోష క విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి

*** కుత్బుల్లాపూర్ సిడిపిఓ రేణుక**




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : పుట్ట బోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణి మహిళలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోదవాలని కుత్బుల్లాపూర్ సిడిపిఓ రేణుక అన్నారు. పోషణమాస కార్యక్రమంలో భాగంగా గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్ లోని బ్రైట్ కాన్సెప్ట్ పాఠశాలలో రంగారెడ్డినగర్ సెక్టార్ పోషణ మాసోత్సవ కార్యక్రమానికి ఆమె తోపాటు కుత్బుల్లాపూర్ ట్రపస అధ్యక్షులు,పాఠశాల ఛైర్మెన్ లయన్ డాక్టర్. వినోద్ జాదవ్ లు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని 06 సంవత్సర వయసు కలిగిన వారికి 90 శాతం మేధస్సు పెంపొందుతుందన్నారు. సెక్టార్ సూపర్వైజర్ జ్యోతి మాట్లాడుతూ నూనె(జింక్) పదార్థాలకు దూరంగా ఉంటూ చిన్నారులకు సైతం దూరంగా ఉంచాలన్నారు అనంతరం చిన్నారులకు అన్నప్రాసన,అక్షరాభ్యాసం,గర్భిణీ లకు శ్రీమంతాలు నిర్వహించారు..ఈ కార్యక్రమంలో పి డి కె డాక్టర్. మృదుల,సూపర్వైజర్లు విజయలక్ష్మి,భాగ్యమ్మ,ఏ ఎన్ ఎం.రామానుజమ్మ,అంగన్వాడీ టీచర్లు,ఆశా వర్కర్లు పాఠశాల ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.



### వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా
## ప్రధాని మోదీ పరిపాలన కొనసాగుతుంది

*** సేవాపక్ష కమిటీ కన్వీనర్ డాక్టర్ శిరీష రెడ్డి**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : సేవ, సుపరిపాలన, పేదల సంసక్షేమమే లక్ష్యంగా వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ప్రధాని మోదీ పరిపాలన విజయవంతంగా కొనసాగుతుందని సేవాపక్ష కమిటీ కన్వీనర్ డాక్టర్ శిరీష రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 అక్టోబర్ 2 వరకు జరిగే సేవ పక్ష ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా కెపిహెచ్బి డివిజన్ వసంత నగర్ లో గురువారం తల్లి పేరు ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శిరీష రెడ్డి మాట్లాడుతూ అమ్మ పేరు మీద ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రధాని ఇచ్చిన పిలుపు మేరకు మొక్కలు నాటడం జరిగిందన్నారు. అడవులు రోజురోజుకు అంతరించి పోతున్నాయని దానివల్ల వర్షాలు తగ్గడమే కాకుండా సూర్యతాపం మరింత పెరుగుతుందన్నారు. ప్రజా ఆశీస్సులతో తెలంగాణలో రాబోయేది బీజేపి ప్రభుత్వమేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. సేవా పక్షంలో భాగంగా చేపడుతున్న పలు కార్యక్రమాల్లో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెపిహెచ్బి డివిజన్ భారతీయ జనతా పార్టీ కన్వీనర్ గురు ప్రసాద్, తోట రమేష్, హరిత, ప్రవీణ్, గిరిధర్ రెడ్డి, జగన్, మాధవ్, కన్నబాబు, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై ఈసీ కీలక నిర్ణయం



ఎన్నికల ప్రక్రియలో మరింత పారదర్శకతను పెంపొందించడానికి కేంద్ర ఎన్నికల సంఘం మరో కీలక నిర్ణయం తీసుకుంది. లోక్సభ, అసెంబ్లీ ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రక్రియను క్రమబద్ధీకరిస్తూ గురువారం కీలక ప్రకటన చేసింది. ఇకపై పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాతనే ఈవీఎంల చివరి రెండవ రౌండ్ ను లెక్కించాలని నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం కౌంటింగ్ రోజున ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మొదలవుతుండగా ఈవీఎం లెక్కింపు 8:30 గంటలకు ప్రారంభమవుతున్నది. అయితే ఇటీవల వికలాంగులు, 85 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి వద్ద ఓటు వేయడానికి ఈసీ అనుమతి ఇచ్చింది. దీంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో కొన్ని స్థానాల్లో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుకంటే ముందే ఈవీఎంల లెక్కింపు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆ తర్వాత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో జాప్యంతో పాటు, అనవసరపు గందరగోళాన్ని నివారించేందుకు వీలుగా ఇకపై ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తున్న క్రమంలో చివరి రెండో రౌండ్ కౌంటింగ్ కంటే ముందే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తి చేయనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయ్యేకే ఈవీఎంల మిగిలిన రెండు రౌంట్లను లెక్కించి ఫలితాలను ప్రకటించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎక్కువగా ఉన్నట్లయితే ఆ మేరకు తగినన్ని టేబుళ్లు, సిబ్బంది ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఈసీ ఆదేశించింది. కాగా ఎన్నికల ప్రక్రియను మరింతగా మెరుగుపరిచేందుకు ఎన్నికల సంఘం గత ఆరునెలల్లో ఇప్పటి వరకు వివిధ అంశాలపై 29 నిర్ణయాలు తీసుకోగా ఇది 30వ నిర్ణయం.

## 26న కొత్తగూడెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద భారీ ధర్నా

*** జేఏసీ పిలుపు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘాల జేఏసీ నేతలు ప్రభుత్వం, యాజమాన్యం మీద తీవ్రంగా విరుచుకుపడ్డారు. కేవలం రూ.500 పెంపుతో చేతులు దులుపుకోవడం కాంట్రాక్టు కార్మికులపై ఘోర అన్యాయమని వారు విమర్శించారు. 6395 కోట్ల రూపాయల లాభాలను సింగరేణి యాజమాన్యం సాధించిందని, కానీ ఆ లాభాల్లో 36 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు సరైన వాటా ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. బోనస్ చట్టం ప్రకారం 20 శాతం వరకు బోనస్ ఇవ్వాల్సిన హక్కు ఉన్నప్పటికీ, ఒక్కో కార్మికునికి కనీసం రూ.20,000 రావలసి ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హామీలు, కోల్ బెల్ట్ ఎమ్మెల్యేల మాటలు అన్నీ గాలికొదిలిన వాగ్దానాలేనని, ఇప్పటికైనా స్పందించి కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా, వేతనాల పెంపు కల్పించాలని డిమాండ్ చేశారు. జేఏసీ నేతలు మల్లెల రామనాథం, భూక్య రమేష్, గుడెల్లి యకయ్య, గూగులోత్ సక్రాం, మాతంగి రాజేష్, భాస్కర్, రాణి, రవి, తాండ్ర విజయ్ తదితరులు పాల్గొన్నారు. జేఏసీ పిలుపు మేరకు (26న) కొత్తగూడెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు, కాంట్రాక్టు కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

*** చౌటుప్పల కమిషనర్ జి వెంకట్రాంరెడ్డి**






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: స్వచ్ఛతాహీ సేవ 2025 కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సఫాయిమిత్ర సురక్ష శివర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రామిరెడ్డి చేతులమీదుగా పారిశుద్ధ కార్మికులకు అందరికీ దుస్తువులు, రెయిన్ కోట్ లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేసే ప్రతి పారిశుద్ధ కార్మికుడికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్క మున్సిపల్ కార్మికుడు కష్టపడి పని చేస్తేనే చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిశుభ్రంగా ఉంటుందని, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పారిశుద్ధ్యంలో రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని పారిశుద్ధ కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ రఘుపతి, జూనియర్ అసిస్టెంట్ రవీందర్, వార్డ్ ఆఫీసర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్ పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, మెప్మా టిఎంసి కవిత, జవాన్ నరసింహ, అంజయ్య, పారిశుద్ధ్య, విద్యుత్ వాటర్ సప్లై విభాగం కార్మికులందరూ పాల్గొన్నారు.

# తెలంగాణలో నెలలోపు కొత్త అక్రిడిటేషన్ కార్డులు

నెలలోపు అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం అవుతుందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ చెప్పారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న పలువురు జర్నలిస్టులు బషీర్‌బాగ్‌లోని యూనియన్ కార్యాలయానికి వచ్చి యూనియన్ సభ్యత్వాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విరాహత్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడంతో ఎంతోమంది జర్నలిస్టులు కానీ వారు కూడా జర్నలిస్టులుగా చెలామణి అయ్యారని అన్నారు. అసలైన వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించి కార్డులను జారీ చేయాలనే తలంపులో భాగంగానే జారీ ప్రక్రియ కొంత ఆలస్యమైందని, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో




పకడ్బందీ విధివిధానాలను రూపొందించారని చెప్పారు. హెల్త్ కార్డులు సైతం నామ్ కే వాస్తుగా ఉన్నాయని, అత్యవసర పరిస్థితిలో ఏ కార్పొరేట్ ఆసుపత్రి సైతం వాటిని స్వీకరించడం లేదని, దీనికి ప్రత్యమ్నయంగా త్వరలోనే రాష్ట్రంలోనే ఏ కార్పొరేట్ ఆసుపత్రిలోనైనా జర్నలిస్టు హెల్త్ కార్డులను స్వీకరించేలా అత్యద్భుతమైన జర్నలిస్ట్ హెల్త్ స్కీమును తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్ట్ వైద్య చికిత్సలకు సంబంధించి ఎంత ఖర్చయినా ప్రభుత్వం భరిస్తుందన్నారు. దాదాపు 70 యేండ్ల సుదీర్ఘ పోరాటాల చరిత్ర, రాష్ట్రంలో వేలాది జర్నలిస్టుల విశ్వాసం చూరగొంటున్న ఘనత దేశంలో తమ సంఘానికి మాత్రమే దక్కిందని స్పష్టం చేశారు. ఐక్యత, పోరాటాలు, త్యాగాల పునాదులపై తమ సంఘం నిర్మితమైందన్నారు. కొన్ని అరాచక శక్తుల చర్యల మూలంగా ప్రస్తుతం మీడియా భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, పవిత్రమైన జర్నలిజం వృత్తిని పరిరక్షించేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం యువ జర్నలిస్ట్ నాగరాజు గౌడ్ నేతృత్వంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు జర్నలిస్టులు విరాహత్ అలీ, కార్యదర్శి మధుగౌడ్ సమక్షంలో టీయూడబ్ల్యూజేలో చేరారు.

## సీపీఐ జాతీయ సమితిలో తెలంగాణకు సముచిత స్థానం

హైదరాబాద్: సీపీఐ జాతీయ సమితిలో తెలంగాణకు సముచిత స్థానం దక్కింది. పార్టీ జాతీయ కార్యవర్గంలో మరోసారి కూనంనేని సాంబశివరావు, పశ్య పద్మకు అవకాశం లభించింది. సీపీఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా డాక్టర్ కె.నారాయణ, సభ్యులుగా ఎం.డి.యూసఫ్, జాతీయ కార్యదర్శిగా పల్లా వెంకట్ రెడ్డి నియమితులయ్యారు. చండీగఢ్‌లో జరిగిన సీపీఐ 25వ జాతీయ మహాసభలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

## మెట్రో నష్టాలు.. తెలంగాణ ప్రభుత్వమే తేల్చుకోవాలి

* కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఢిల్లీ: హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో 4 లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. పర్యావరణానికి, వన్యప్రాణులకు ఎలాంటి నష్టం లేకుండా హైవేల నిర్మాణం చేపడతామన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం ముందుకొచ్చిందని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి గడ్కరీ చెప్పారని అన్నారు. ''భూసేకరణ త్వరగా పూర్తిచేస్తే.. ప్రాజెక్టుల నిర్మాణం త్వరగా అవుతుంది. మెట్రో విస్తరణలో సీఎం వ్యవహారశైలి సమంజసంగా లేదు. రాష్ట్రానికి



నిధులు, ప్రాజెక్టులు రావాలని కోరుకునే వ్యక్తుల్లో ముందుంటా. ఆర్ఆర్ఆర్, మెట్రో విషయంలో ప్రోయాక్టివ్‌గా వ్యవహరించాం. హైదరాబాద్ మెట్రో ఇప్పటికే నష్టాల్లో నడుస్తోంది. మెట్రో నష్టాలు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం.. వారే తేల్చుకోవాలి. మెట్రోకు అన్ని రకాలుగా మా సహకారం ఉంటుంది. కాళేశ్వరంపై సీబీఐ ప్రతిపాదనలు అందాయి. ఆ అంశం పరిశీలనలో ఉంది. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీలకు భాజపా భయం పట్టుకుంది. భారత రాష్ట్ర సమితితోనో, కాంగ్రెస్‌తోనో కలిసే ప్రసక్తే లేదు. గతంలో ఆ రెండు పార్టీలు కలిసి ప్రభుత్వాలు నడిపాయి. తెలంగాణలో ఒంటరిగానే పోటీ చేస్తాం. బీసీ రిజర్వేషన్లకు అసెంబ్లీలో మద్దతిచ్చాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి'' అని కిషన్‌రెడ్డి అన్నారు.



## మళ్లీ గులాబీ గూటికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

ములుగు: సిర్పూర్ కాగజ్ నగర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తిరిగి భారత రాష్ట్ర సమితి గూటికి చేరారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి పాలైన కోనప్ప.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భారత రాష్ట్ర సమితిలో చేరిన తర్వాత పార్టీకి దూరమయ్యారు. గత కొంతకాలంగా ఆయన కేసీఆర్‌కు అనుకూలంగా ప్రకటనలు చేస్తుండటంతో తిరిగి పార్టీలోకి వస్తారని ప్రచారం జరిగింది. అందరూ ఊహించినట్లుగానే.. ఎర్రవల్లిలో ఇవాళ ఆయన గులాబీ కండువా కప్పుకొన్నారు. కోనప్పతో పాటు ఆయన సోదరుడు కృష్ణ కూడా పార్టీలో చేరారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి: కేటీఆర్

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR) సూచించారు. పార్టీ నేతలతో కేటీఆర్, హరీశ్‌రావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లను ఆదేశించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అందరితో మమేకమై ఉండే గెలుపు గుర్రాలకు పోటీకి అవకాశం కల్పించేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని.. ప్రజలు భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ వైపు ఎదురు చూస్తున్నారన్నారు. హామీలు అమలు చేయకపోవడం, ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక సమస్యల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పల్లె ప్రగతి పేరిట గ్రామీణ ప్రాంతాల్లో భారత రాష్ట్ర సమితి హయాంలో చేసిన కార్యక్రమాలు, వాటి ఫలితాలు.. ఇప్పుడు పల్లెల్లో పరిస్థితిని కూడా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. బతుకమ్మ పండుగకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయలేదని, తెలంగాణ సంస్కృతి పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. స్థానికంగా భారత రాష్ట్ర సమితి నేతల ద్వారా బతుకమ్మ కోసం ఏర్పాట్లు చేసేలా చూడాలని సూచించారు.



## పుణె యూనివర్సిటీకి రూ.2.46 కోట్ల కుచ్చుటోపీ.. తెలంగాణ ఇంజినీర్ అరెస్టు

ఐఐటీ బాంబే ప్రొఫెసర్‌నంటూ పుణె యూనివర్సిటీని బురిడీ కొట్టించిన కేసులో పోలీసులు ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు ఇస్తామంటూ నమ్మించి రూ.కోట్లు కాజేసిన అతడు తెలంగాణకు చెందిన ఇంజినీర్ అని వెల్లడించారు. జులై 25ఆగస్టు 26 మధ్య జరిగిన సైబర్ మోసం గురించి తాజాగా పోలీసులు వెల్లడించారు. పుణె యూనివర్సిటీకి చెందిన ప్రధాన అధికారికి ఆ సమయంలో ఓ ఫోన్ వచ్చింది. తాను ఐఐటీ బాంబే ప్రొఫెసర్‌నంటూ సైబర్ నేరగాడు ఆ అధికారితో పరిచయం చేసుకున్నాడు. రూ.28 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులు మీ విశ్వవిద్యాలయానికి ఇస్తామంటూ నమ్మించాడు. కాకపోతే.. ఆ ప్రాజెక్టుల కోసం అడ్వాన్స్‌గా కొంత సొమ్ము చెల్లించాలని



మభ్యపెట్టాడు. తొలుత రూ.56 లక్షలు బదిలీ చేయించుకున్నాడు. ఇలాగే పలుమార్లు ప్రాజెక్టుల పేరు చెప్పి రూ.2.46 కోట్లు కాజేశాడు. ఒప్పందం చేసుకునేందుకు వస్తామంటూ మాయమాటలు కూడా చెప్పాడు. తీరా ఎవరూ రాకపోయేసరికి వారు ఐఐటీ ప్రొఫెసర్‌ను సంప్రదించగా తాను ఎలాంటి ప్రాజెక్టు ఒప్పందాలు చేసుకోలేదని పేర్కొన్నారు. దీంతో మోసపోయామని గ్రహించిన యూనివర్సిటీ అధికారులు పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసులో విచారణ ప్రారంభించిన పోలీసులు అతడి పేరు కిలారు సీతయ్యగా గుర్తించారు . హైదరాబాద్ నివాసి అని చెప్పారు. ఈ మోసం కేసులో అతడే ప్రధాన సూత్రధారి అని, సెప్టెంబర్ 21న అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన అతడు.. యూకేకు చెందిన విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పొందాడు. 201920లో తాను యూపీఎస్సీ ప్రిలిమ్స్, మెయిన్స్ పాసైనట్లు విచారణలో వెల్లడించాడు. ప్రస్తుతం కోర్టు అతడిని పోలీసు కస్టడీకి అప్పగించింది.

## గిరిజన, బంజారా భవనాలకు రూ.16.50 కోట్లు

* **ఏటూరు నాగారం, ఉట్నూరు ఐటీడీఏ నూతన భవనాల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు**
* **గిరిజన, బంజారాల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం**
* **రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

గిరిజన, బంజారాల అభ్యున్నతి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి వారి జీవిత ప్రమాణాల మెరుగుదలకు అనేక కార్యక్రమాలు చేపట్టారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి దూరదృష్టితో ముందుకు వెళ్తున్నారన్నారు. గురువారం ప్రభుత్వం గిరిజన, బంజారా భవనాలకు రూ.16.50 కోట్లు, ఏటూరు నాగారం, ఉట్నూరు ఐటీడీఏ నూతన భవనాల నిర్మాణానికి చెరో రూ.15 కోట్లు చొప్పున మొత్తం రూ.30 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రూ.16.50 కోట్లు వ్యయంతో 6 కొత్త గిరిజన, బంజారా భవనాల నిర్మాణం, ఇప్పటికే ఉన్న 9 భవనాలకు అదనపు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం పరిపాలన అనుమతులకు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సహకారంతో గిరిజన సంక్షేమ



రంగంలో కొత్త పుంతలు తొక్కుతున్నామన్నారు. ఉట్నూరు, ఏటూరు నాగారం ఐటీడీఏ భవనాలు శిథిలావస్థలో ఉండటంతో, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చేసిన విజ్ఞప్తి మేరకు తాను వ్యక్తిగతంగా సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరులో ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కొత్త భవనాలు గిరిజనుల సాంస్కృతిక, విద్యా, పరిపాలనా కార్యకలాపాలకు కేంద్రాలుగా నిలిచి వారి సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు.

* **అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నిధుల కేటాయింపు వివరాలు**

ఉట్నూర్ (ఖానాపూర్), నిర్మల్, దేవరకొండ, కరీంనగర్, హుజూర్‌నగర్ (సూర్యాపేట), మన్ననూరు (అచ్చంపేట) లకు రూ.50 లక్షలు చొప్పున కేటాయించారు. వికారాబాద్ 59 లక్షలు కేటాయించగా, పెద్దూరు (సిరిసిల్ల), కూసుమంచి, తిరుమలయపాలెం (ఖమ్మం) లకు రూ. కోటి చొప్పున కేటాయించారు. బాచుపల్లి (కుత్బుల్లాపూర్), మంచిర్యాల, నారాయణఖేడ్, కేసముద్రం (మహబూబాబాద్), ఖమ్మం రూరల్ (ఖమ్మం) లకు రెండు కోట్ల చొప్పున నిధులను కేటాయించారు.

## హైదరాబాద్ వేదికగా 'గ్లోబల్ సెమీకండక్టర్ కాన్‌స్టిట్యూషన్' సదస్సు

టెక్నాలజీ చిప్ ఇన్నోవేషన్ ప్రోగ్రాం (టీచిప్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 27 నుంచి 28 వరకు హైదరాబాద్ నగరంలో టీచిప్ సెమీకాన్ రాజ్యాంగ సదస్సు 2025 నిర్వహించనున్నారు. సెమీకండక్టర్ రంగానికి ఈ సదస్సు చారిత్రక ఘట్టంగా నిలవనుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలు, విద్యా, శాస్త్ర సాంకేతిక రంగాలకు చెందిన ప్రముఖులు ఈ సదస్సులో భాగస్వాములుకానున్నారు. ఈ సదస్సు ద్వారా 'గ్లోబల్ సెమీకండక్టర్ కాన్‌స్టిట్యూషన్' మార్గసూచక రాజ్యాంగం రూపుదిద్దుకోనుంది. ఈ సదస్సు సాధారణంగా నిర్వహించే సాంకేతిక సమావేశం కాదని, భవిష్యత్తు కోసం ఒక స్పష్టమైన దిశను నిర్దేశించేందుకు తీసుకున్న కీలక ప్రయత్నమని నిర్వాహకులు తెలిపారు. టాలెంట్, డిజైన్, మాన్యుఫ్యాక్చరింగ్, అప్లికేషన్స్ అనే నాలుగు ముఖ్యమైన అంశాలపై ఆధారపడిన టీచిప్ వ్యూహం ఆధారంగా ఇది సెమీకండక్టర్ ఆలోచన విధానానికి ప్రతి ఘట్టాన్ని అభివృద్ధి చేసే దిశగా ఒక రోడ్‌మ్యాప్‌గా పనిచేయనుంది. రెండు రోజుల సదస్సులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి కీలక అధికారులతోపాటు ఎలక్ట్రానిక్స్, విద్య, రక్షణ రంగాలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నారు.




రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, ప్రధాన యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లు, ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల విభాగాధిపతులు, ఇండియా ఎలక్ట్రానిక్స్ అండ్ సెమీకండక్టర్ అసోసియేషన్ (ఐఈఎస్ఏ) డైరెక్టర్ డా.కె.జి.విశ్వనాథన్, క్వాంటం టెక్నాలజీస్ డైరెక్టర్ చెల్లె వెంకట రామరాజు తదితరులు పాల్గొంటారు. అంతర్జాతీయ స్థాయిలో తైవాన్‌కు చెందిన నేషనల్ యాంగ్ మింగ్ చియో టంగ్ యూనివర్శిటీ (ఎన్‌వైసీయు), తైవాన్ సెమీకండక్టర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (టీఎస్ఆర్ఐ), ఏఆర్ఎం, జియుఎస్ టెక్నాలజీ సంస్థల ప్రతినిధులు సదస్సుకు హాజరవుతారు. గస్ టెక్నాలజీ సీఈఓ సీసీ ఛాంగ్ ప్రత్యేక ఆహ్వానితులుగా రానున్నారు. ఈ సదస్సులో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ అభివృద్ధి చేసిన స్వదేశీ చిప్‌ను మొట్టమొదటిసారిగా ప్రజలకు పరిచయం చేయనున్నారు. ఇది భారతదేశం సెమీకండక్టర్ రంగంలో తన సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలియజేయడంలో ఒక మైలురాయి కానుంది. సదస్సులో సెమీకండక్టర్ రంగంపై అనుభవజ్ఞుల 'టి చిప్', వివిధ సంస్థల మధ్య అవగాహన ఒప్పందాలపై సంతకాలు జరగనున్నాయి. చివరగా జరిగే నెట్‌వర్కింగ్ డిన్నర్‌లో సెమీకండక్టర్ రంగానికి సంబంధించిన ప్రముఖులు భవిష్యత్తు సహకార మార్గాలపై చర్చించనున్నట్లు టీ చిప్ చైర్మన్ సందీప్‌కుమార్ మక్తాలా తెలిపారు. పాల్గొనాలనుకునే వారు tinyurl.com/tsemicon వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని.. లేదంటే +91 8019977575 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

# వరుసగా ఐదోరోజూ నష్టాల్లోనే..

## 555 పాయింట్లు పతనమైన సెన్సెక్స్..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదోరోజు నష్టపోయాయి. మెటల్ సూచీలు మినహా మిగతా రంగాల్లో అమ్మకాలతో మార్కెట్లు ఒత్తిడికి గురయ్యాయి. ట్రంప్ హెచ్1బీ పాలసీ నేపథ్యంలో మరోసారి ఐటీ స్టాక్స్ భారీగా పతనమయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,574.31 పాయింట్ల నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,092.89 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. 81,840.73 పాయింట్ల గరిష్టానికి చేరుకుంది. చివరగా 555.95 పాయింట్లు పతనమై.. 81,159.68 వద్ద స్థిరపడింది. 166.05 పాయింట్లు తగ్గి.. 24,890.85 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు దాదాపు 1,405 షేర్లు లాభపడగా.. 2,586 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో టాటా మోటార్స్, ట్రెంట్, శ్రీరామ్ ఫైనాన్స్, టీసీఎస్, పవర్ గ్రిడ్ నష్టాలను చవిచూశాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, హిందాల్కో, యాక్సిస్ బ్యాంక్, ఓఎన్‌జీసీ, హీరో మోటోకార్ప్ లాభపడ్డాయి.

రంగాల వారీగా చూస్తే మెటల్ 0.22 శాతం లాభపడగా.. మిగతా అన్ని సూచీలు కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆటో, పవర్, రియాల్టీ ఒక్కొక్కటి ఒకశాతం వరకు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.7శాతం తగ్గాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని యూఎస్ సర్కారు ఇటీవల హెచ్1బీ వీసాపై చేసిన ప్రకటన ఐటీ కంపెనీల షేర్లు నష్టాలను పెంచింది. ఇప్పటివరకు వరుసగా ఐదు సెషన్లలో నష్టాలను నమోదు చేయడంలో ఈ ఇండెక్స్ ఇప్పుడు 6శాతానికిపైగా పడిపోయింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేర్లు ఇండెక్స్‌లో అత్యధికంగా నష్టపోయాయి. 2.5 శాతానికి పైగా పడిపోయి 52 వారాల కనిష్ట స్థాయి రూ.2,956.90కి చేరుకున్నాయి. పెర్సిస్టెంట్ సిస్టమ్స్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు దాదాపు 2శాతం తగ్గాయి. విప్రో, కోఫోర్జ్ షేర్లు ఒక్కొక్కటి ఒకశాతం తగ్గుముఖం పట్టాయి.

# నేటితో ముగియనున్న మిగ్-21 శకం..

## 97 తేజస్ మార్క్-1ఏ కొనుగోలుకు నేడు కీలక ఒప్పందం..!



**న్యూఢిల్లీ:** భారత వైమానిక దళం చరిత్రలో చెరగని ముద్రవేసిన ఫైటర్ జెట్ మిగ్-21 శకం ముగియనుంది. నేడు వీటికి వీడ్కోలు పలకనున్నారు. ఈ నేపథ్యంలో వాటి స్థానంలోకి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి యుద్ధ విమానం తేజస్ ఎంకే 1ఏ ఫైటర్ జెట్లు రానున్నాయి. రూ.62వేల కోట్లతో 97 తేజస్ మార్క్-1ఏ యుద్ధవిమానాల కొనుగోలుకు కేంద్రం ఇటీవలే పచ్చజెండా ఊపిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి రక్షణ శాఖ, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ మధ్య నేడు కీలక ఒప్పందం కుదరనున్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందానికి సంబంధించి నేడు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని రక్షణ వర్గాలు తాజాగా వెల్లడించాయి.

కాగా, రూ.48వేల కోట్లతో 83 యుద్ధవిమానాల సమీకరణకు కేంద్రం కొన్నేళ్ల కిందట పచ్చజెండా ఊపిన విషయం తెలిసిందే. ఇప్పుడు రెండో విడతగా రూ.62వేల కోట్లతో 97 తేజస్ మార్క్-1ఏ యుద్ధవిమానాల కొనుగోలుకు సిద్ధమైంది. మిగ్-21 యుద్ధవిమానాల స్థానంలో వీటిని ప్రవేశపెడతారు. నిజానికి మిగ్ -21 జీవితకాలం ఎప్పుడో ముగిసినా తేజస్ యుద్ధ విమానాల ఉత్పత్తిలో జాప్యం కారణంగా దానిని పొడిగించారు. రేపటితో మిగ్-21 ఫైటర్ జెట్స్ కనుమరుగు కానున్న వేళ.. ఈ కీలక ఒప్పందం జరగనున్నట్లు సమాచారం. తేజస్ రాకతో వైమానిక దళ పోరాట సామర్థ్యం మరింత పెరగనుంది.

# ఒరాకిల్ అధినేత సంచలన నిర్ణయం..

## తన సంపదలో 95 శాతం దానం చేయనున్న ల్యారీ ఎల్లిసన్



**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు, టెక్ దిగ్గజం ఒరాకిల్ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన మొత్తం సంపదలో 95 శాతాన్ని దానం చేయాలని నిర్ణయించుకున్నారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. లారీ ఎల్లిసన్ సంపద ప్రస్తుతం 393 బిలియన్ డాలర్లు (రూ. 34.6 లక్షల కోట్లు). ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో వచ్చిన అనూహ్యమైన వృద్ధి కారణంగా 2025లో ఒరాకిల్ షేర్ల విలువ భారీగా పెరిగింది. కంపెనీలో ఇప్పటికీ 41 శాతం వాటా ఉన్న ఎల్లిసన్ సంపద ఒక్క రోజులోనే అమాంతం పెరిగింది. దీనికి తోడు టెస్లాలో కూడా ఆయనకు గణనీయమైన వాటాలు ఉన్నాయి. ఇక తన సంపదను దాతృత్వానికి వినియోగిస్తానని 2010లోనే ఎల్లిసన్ 'గివింగ్ ప్లెడ్జ్' తీసుకున్నారు. ఇందులో భాగంగా తన సంపదలో 95 శాతం విరాళంగా ఇస్తానని ప్రతిజ్ఞ చేశారు. అయితే, ఆయన ఇతర బిలియనీర్లలా సంప్రదాయ స్వచ్ఛంద సంస్థల వైపు మొగ్గు చూపడం లేదు. దానికి బదులుగా తన సొంత సంస్థల ద్వారానే ఈ బృహత్కార్యాన్ని చేపట్టాలని ఎల్లిసన్ భావిస్తున్నారు. ఇందులో భాగంగానే ఎల్లిసన్ తన దాతృత్వ కార్యక్రమాల్ని ప్రధానంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన లాభాపేక్ష లేని సంస్థ ఎల్లిసన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ద్వారా కొనసాగిస్తున్నారు. ఇది ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రత, వాతావరణ మార్పులు, పరిశోధన.. ఈ నాలుగు కీలకమైన ప్రపంచ సవాళ్లపై దృష్టి సారిస్తోంది.

# ముంబై ఇండియన్స్ కోచ్‌గా ఆస్ట్రేలియా దిగ్గజం..



ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ ముందే ముంబై ఇండియన్స్ హెడ్‌కోచ్‌ను నియమించింది. మూడు సీజన్లుగా జట్టుతో కొనసాగుతున్న చార్లొట్టే ఎడ్వర్డ్స్ స్థానంలో ఆస్ట్రేలియా దిగ్గజం లీసా కీర్‌ట్లేను తీసుకుంది. ఎడ్వర్డ్స్ ఏప్రిల్‌లో ఇంగ్లండ్ జాతీయ జట్టుకు కోచ్‌గా వెళ్లింది. దాంతో, ఆమె స్థానాన్ని అనుభవజ్ఞురాలైన కీర్‌ట్లేతో భర్తీ చేయాలని ఫ్రాంచైజీ నిర్ణయించింది. ముంబైకి కోచ్‌గా ఎంపికవ్వడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. డబ్ల్యూపీఎల్‌లో రెండు ట్రోఫీలతో తమకు తిరుగులేదని చాటిన ఫ్రాంచైజీ విజయయాత్రలో భాగం కావాలని అనుకుంటున్నట్టు ఆమె తెలిపారు. 'ముంబై ఇండియన్స్ హెడ్‌కోచ్‌గా నియమితుల్వడం చాలా గర్వంగా ఉంది. డబ్ల్యూపీఎల్‌లో రెండు ట్రోఫీలతో చెరగని ముద్ర వేసిన జట్టు ముంబై. ఫ్రాంచైజీ సంస్కృతి, విధివిధానాలు నాకు చాలా నచ్చాయి. ప్రతిభావంతులైన ముంబై టీమ్‌తో పనిచేసేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. ముంబై విజయాల్లో పాలుపంచుకొని.. మైదానంలో క్రికెటర్లలో స్ఫూర్తి రగిలించాలని భావిస్తున్నా' అని కీర్‌ట్లే వెల్లడించింది. ఆసీస్ వెటరన్ ప్లేయర్ అయిన కీర్‌ట్లే 1997, 2005లో వరల్డ్ కప్ గెలుపొందిన జట్టులో సభ్యురాలు. కీర్‌ట్లేకు పొట్టి ఫార్మాట్లో కోచ్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఈమధ్యే ఆమె దిశానిర్దేశనంలో నార్తర్న్ సూపర్‌ఛార్జర్స్ జట్టు 'ది హండ్రెడ్ లీగ్'లో ఛాంపియన్‌గా నిలిచింది. అలానే మహిళల బిగ్‌బాష్ లీగ్‌లోనూ సిడ్నీ థండర్స్ జట్టుకు కీగెట్లే సేవలందించారు. అందుకే ఆమెనే తమ జట్టుకు సరైన కోచ్ అని ముంబై యాజమాన్యం భావించింది. మరి.. మూడో టైటిల్ గెలవాలనుకుంటున్న హర్మన్‌ప్రీత్ కౌర్ సేనకు కీర్‌ట్లే ఏమేరకు తోడ్పడుతుందో చూడాలి. డబ్ల్యూపీఎల్‌లో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని ముంబై ఇండియన్స్ వరుసగా రెండు సీజన్లలో విజేతగా నిలిచిన విషయం తెలిసిందే.

# రౌఫ్, ఫర్హాన్‌పై ఫిర్యాదు చేసిన బీసీసీఐ



**దుబాయ్:** ఆసియాకప్‌లో గత ఆదివారం సూపర్ ఫోర్ మ్యాచ్‌లో భాగంగా ఇండియా, పాకిస్థాన్ జట్లు తలపడిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో పాకిస్థాన్ ఆటగాళ్లు హరీస్ రౌఫ్, షాహిబ్జాద ఫర్హాన్ ప్రవర్తించిన తీరును భారత్ ఖండించింది. ఈ నేపథ్యంలో ఐసీసీ వద్ద అధికారికంగా ఫిర్యాదు నమోదు చేసింది. బుధవారం రోజున ఆ ఫిర్యాదు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఐసీసీకి ఈమెయిల్ ద్వారా ఆ ఫిర్యాదు చేశారు. ఒకవేళ లిఖితపూర్వకంగా ఫర్హాన్, రౌఫ్‌లు ఆ ఆరోపణలను ఖండిస్తే అప్పుడు ఐసీసీ దీనిపై దర్యాప్తు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఐసీసీ ఎలైట్ ప్యానెల్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ముందు ఆ ఇద్దరూ విచారణకు హాజరుకావాల్సి ఉంటుంది.

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కూడా ఐసీసీ ముందు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు వ్యతిరేకంగా అధికారికంగా ఫిర్యాదు నమోదు చేసినట్లు తెలుస్తోంది. పెహల్గామ్ ఉగ్రవాద దాడిలో మరణించిన వారికి సంఘీభావంగా పాక్ ఆటగాళ్లతో కరచాలనం చేయలేదని కెప్టెన్ సూర్య పేర్కొన్న విషయం తెలిసిందే. సూర్య చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఉన్నట్లు పీసీబీ ఆరోపించింది.

సెప్టెంబర్ 21వ తేదీన జరిగిన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ బౌండరీ లైన్ వద్ద రౌఫ్ కొన్ని సంకేతాలు చేశాడు. చేతి వేళ్లతో 6-0 చూపిస్తూ, విమానాలు కూలినట్లు సంజ్ఞ చేశాడు. గిల్, అభిషేక్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు వారితో వాగ్వాదానికి దిగాడు. ఇదే మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేసిన ఫర్హాన్.. సెలబ్రేషన్‌లో భాగంగా తన బ్యాట్‌తో గన్ ఫైరింగ్ చేస్తున్నట్లు ఫోజు పెట్టాడు. ఐసీసీ ముందు ఆ ఇద్దరు ప్లేయర్లు వివరణ ఇవ్వకుంటే వాళ్లు ప్రవర్తనా నియమావళి కింద శిక్ష ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి.

ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ చైర్మెన్ మోషిన్ నఖ్వీ కూడా బుధవారం తన ఎక్స్ అకౌంట్‌లో ఓ వీడియోను పోస్టు చేశాడు. క్రిస్టియానా రోనాల్డోకు చెందిన స్లో మోషన్ వీడియోను పోస్టు చేశారు. విమానం అకస్మాత్తుగా కూలుతున్నట్లు ఆ వీడియోలో రోనాల్డ్ సంకేతం ఇస్తాడు. రౌఫ్ కూడా ఇలాంటి సంజ్ఞ చేశాడు.

## విండీస్‌తో టెస్టు సిరీస్..

# జట్టును ప్రకటించిన అగార్కర్



**ముంబై:** వెస్టిండీస్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు టీమిండియా జట్టును ఇవాళ బీసీసీఐ ప్రకటించింది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ 15 మంది సభ్యులతో కూడిన బృందాన్ని ప్రకటించారు. కెప్టెన్సీ బాధ్యతలు శుభమన్ గిల్‌కు దక్కాయి. ఇక రవీంద్ర జడేజాకు ఈసారి వైస్ కెప్టెన్సీ ఇచ్చారు. జట్టులో యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, ఎన్ జగదీశన్ ఉన్నారు.

వెస్టిండీస్‌తో రెండు టెస్టు మ్యాచ్‌లు జరగనున్నాయి. తొలి టెస్టు అక్టోబర్ 2వ తేదీన ప్రారంభంకానున్నది. గాయం కారణంగా రిషబ్ పంత్‌ను ఎంపిక చేయలేదు. ఇక బ్యాటర్ కరుణ్ నాయర్‌ను కూడా పక్కనపెట్టేశారు. అహ్మదాబాద్, ఢిల్లీలో మ్యాచ్‌లు జరగనున్నాయి. రిషబ్‌కు ఫ్రాక్చర్ కావడంతో.. అతని స్థానంలో జడేజాకు వైస్ కెప్టెన్సీ ఇచ్చారు. అయితే సౌతాఫ్రికాతో జరిగే హోం సిరీస్‌కు రిషబ్ పంత్ అందుబాటులో ఉంటారని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అభిప్రాయపడ్డాడు.

కరుణ్ నాయర్ నుంచి చాలా ఆశించామని, ఒక్క ఇన్నింగ్స్ ఆడడం కాదు అని, అయితే పడిక్కల్ మంచి ఫామ్‌లో ఉన్నాడని, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎవరికీ ఎక్కువ ఛాన్సులు ఇవ్వలేమని అగార్కర్ అన్నాడు.

## పాటిదార్ త్యాగం..

# అయ్యర్‌కు వన్డే జట్టు పగ్గాలు..!

**న్యూఢిల్లీ:** భారత మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ వన్డే పగ్గాలు అందుకున్నాడు. ఇండియా 'ఏ' జట్టు సారథిగా ఒకే ఒక టెస్టు మ్యాచ్ ఆడిన అయ్యర్‌ను కెప్టెన్‌గా చేశారు సెలెక్టర్లు. ఆస్ట్రేలియా 'ఏ'తో జరుగబోయే మూడు వన్డేల సిరీస్‌లో అయ్యర్ సారథిగా బరిలోకి దిగనున్నాడు. మామూలుగా అయితే రజత్ పాటిదార్ కెప్టెన్‌గా వ్యవహరించాల్సింది. కానీ, అయ్యర్ కోసం అతడు తన పదవిని త్యాగం చేశాడు. రెండు, మూడు మ్యాచ్‌లకు ఇండియా ఏ సారథిగా ఉండాల్సిన తిలక్ వర్మ సర్పంచ్ సాబ్‌కు డిప్యూటీగా కొనసాగుతాడు.

ఆసియా కప్ స్క్వాడ్‌లో అయ్యర్‌కు చోటు కల్పించని సెలెక్టర్లు.. అతడిని శాంతపరిచేందుకు ఇండియా ఏ జట్టుకు కెప్టెన్‌ను చేశారు. కానీ, అతడు మాత్రం ఆస్ట్రేలియా ఏ జట్టుతో ఒకే ఒక నాలుగు రోజుల మ్యాచ్ ఆడాడు. మ్యాచ్ అనంతరం తాను ఫిట్‌గా లేనందున టెస్టుల నుంచి కొన్ని రోజులు విశ్రాంతి కావాలని బీసీసీఐ లేఖ రాశాడు. అతడి లేఖ అందిన వెంటే బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. టెస్టుల నుంచి బ్రేక్ ఇస్తూ వన్డే సిరీస్‌కు సారథిగా ఎంపిక చేసింది.

స్వదేశంలో సెప్టెంబర్ 30 నుంచి ఆస్ట్రేలియా ఏ జట్టుతో జరుగబోయే మూడు వన్డేల సిరీస్‌లో ఇండియా ఏను అయ్యర్ నడిపించనున్నాడు. దాంతో, ఇదివరకే కెప్టెన్‌గా ప్రకటించిన పాటిదార్‌కు ఇరానీ కప్‌లో విదర్భ నాయకుడిగా బాధ్యతలు అప్పగించింది. భారత్ ఏ, ఆస్ట్రేలియా జట్ల మధ్య సెప్టెంబర్ 30న కాన్పూర్‌లో తొలి మ్యాచ్ జరుగనుంది. అనంతరం ఇదే వేదికపై మిగతా రెండు వన్డేల్లో ఇరుజట్లు తలపడుతాయి.





**ఇండియా ఏ స్క్వాడ్ (తొలి వన్డేకు) :** శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ఆయుష్ బదొని, సూర్యాన్ష్ షెడ్గే, విప్రజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుధ్‌వీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పొరెల్(వికెట్ కీపర్), ప్రియాన్ష్ ఆర్య, సిమర్జిత్ సింగ్.

**ఇండియా ఏ స్క్వాడ్ (రెండు, మూడో వన్డేలకు) :** శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రాన్ సింగ్(వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ఆయుష్ బదొని, సూర్యాన్ష్ షెడ్గే, విప్రజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుధ్‌వీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పొరెల్(వికెట్ కీపర్), హర్షిత్ రానా, అర్ష్‌దీప్ సింగ్.

## వడ చెన్నై 2పై క్లారిటీ ఇచ్చిన ధనుష్



టాకీస్: ధనుష్-వెట్రిమారన్ కాంబినేషన్ అంటే వెంటనే గుర్తొచ్చే సినిమా వడ చెన్నై. గ్యాంగ్ స్టర్ డ్రామా నేపథ్యంలో 2018లో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఈ ఇద్దరు మరోసారి సీక్వెల్ ప్రాజెక్ట్ వడ చెన్నై 2 తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారని ఇప్పటికే వార్తలు రౌండప్ చేస్తున్నాయి. శింబుతో చేయబోతున్న సినిమా త్వరలోనే మొదలవుతుందని.. ఈ మూవీ పూర్తవగానే వడ చెన్నై 2ను సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నట్టు వెట్రిమారన్ క్లారిటీ కూడా గతంలో ఇచ్చాడు. తాజాగా ధనుష్ అధికారికంగా వడ చెన్నై 2 సినిమా గురించి ప్రకటించి అభిమానుల్లో నెలకొన్న డైలమాకు చెక్ పెట్టాడు. ప్రస్తుతం ఇడ్లీ కడై ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాడు ధనుష్. ప్రమోషనల్ ఈవెంట్‌లో సీక్వెల్ గురించి ధనుష్ మాట్లాడుతూ.. వడ చెన్నై 2 షూటింగ్ 2026లో మొదలవుతుంది. ఈ మూవీని 2027లో థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని చెప్పాడు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న వడ చెన్నై 2పై తమ ఫేవరేట్ స్టార్ యాక్టర్ నుంచే స్పష్టత ఇవ్వడంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. వడ చెన్నై ఫస్ట్ పార్టులో అండ్రియా, అమీర్, కిశోర్, సముద్రఖని, ఐశ్వర్య రాజేశ్ ఇతర కీలక పాత్రల్లో నటించగా.. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ డైరెక్టర్. కాగా మరి సీక్వెల్‌లో ఎవరెవరు సిల్వర్ స్క్రీన్‌పై మెరువబోతున్నారనేది ఆసక్తిగా నెలకొంది.

## దుమ్మురేపుతున్న ఓజీ..




టాకీస్: పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో, యువ దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ డ్రామా "ఓజీ" ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. గురువారం ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కాగా, తెలుగు రాష్ట్రాల్లో బుధవారం రాత్రి 10 గంటల నుంచే ప్రీమియర్ షోలు పడ్డాయి. పవన్ గత చిత్రాల కంటే ఈ సినిమాపై భారీ అంచనాలు ఉండటంతో, అభిమానులు ప్రీమియర్ల కోసం థియేటర్ల దగ్గర పడిగాపులు కాసారు. విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లో ప్రీమియర్ షోలకి టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి.

ప్రత్యేకంగా విజయవాడ శివారు ప్రాంతంలో 60కి పైగా ప్రీమియర్ షోలు పడినట్టు సమాచారం, ఇది సినిమా క్రేజ్‌కి నిదర్శనం. కొన్ని ప్రాంతాల్లో ఆన్‌లైన్ టిక్కెట్లను బ్లాక్ చేసి, ఆఫ్‌లైన్లో అధిక ధరలకు విక్రయించారంటూ విమర్శలు కూడా వచ్చాయి. అయితే నైజాం ఏరియాలో ఏకంగా 366 ప్రీమియర్ షోలు వేయడం, టాలీవుడ్ చరిత్రలో ఇదే మొదటిసారి. అన్ని థియేటర్ల దగ్గర హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమివ్వడం విశేషం. అభిమానులు థియేటర్ల దగ్గర సంబరాల్లో మునిగిపోయారు. "నైజాం అంటే పవన్ అడ్డా" అంటూ అభిమానులు గర్వంగా చెబుతున్నారు.

ప్రీమియర్ షోల తర్వాత సినిమాకి మిక్స్‌డ్ టాక్ వస్తున్నా, ఫ్యాన్స్ మాత్రం సినిమాని ఆకాశానికెత్తేస్తున్నారు. పవన్ గ్యాంగ్‌స్టర్ ఓజాస్ గంభీర పాత్రలో దర్శనం ఇవ్వగా, ఆ పాత్రకు ఆయన న్యాయం చేశాడని, దర్శకుడు సుజీత్ పవన్‌కి ఫ్యాన్‌బాయ్‌లా చూపించి సినిమా తీర్చిదిద్దాడని మెగా ఫ్యాన్స్ చెబుతున్నారు. మరోవైపు తమన్ సంగీతం సినిమాకి అదనపు బలంగా నిలిచిందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. "ఈ సినిమా పవన్ కళ్యాణ్ కోసం, పవన్ ఫ్యాన్స్ కోసం పవన్ అభిమాని తీసిన సినిమా! ,ఓజీని ఆపడం ఎవరి తరం కాదు - యాంటీ ఫ్యాన్స్ నెగిటివ్ రివ్యూలు ఇవ్వవచ్చు, కానీ కలెక్షన్ల ఊపు ఆగదు! అంటూ సోషల్ మీడియాలో ఫ్యాన్స్ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. మొత్తానికి 'ఓజీ' ప్రీమియర్ షోలతోనే పలు రికార్డులను బద్దలుకొట్టింది.



## కేరళ కుట్టికి బంపర్ ఆఫర్..

టాకీస్: అనంతిక సనీల్ కుమార్.. ప్రస్తుతం తెలుగు సినిమా ప్రపంచంలో టాప్ హీరోయిన్లలో ఒకరు. ఒక్క సినిమాతోనే ఇండస్ట్రీలో విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకుంది. తక్కువ సమయంలోనే ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు బ్యాక్ టూ బ్యాక్ చిత్రాల అవకాశాలు అందుకుంటుంది. అనంతిక సనీల్ కుమార్.. తెలుగులో చాలా పాపులర్ హీరోయిన్. మొదటి సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ అమ్మడు.. ఆ తర్వాత 8 వసంతాలు మూవీతో ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ ఆమె. మ్యాడ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఫస్ట్ మూవీతో అందం, అభినయంతో కట్టిపడేసింది. ఇక ఇటీవల 8 వసంతాలు సినిమాతో నటిగా మంచి మార్కులు కొట్టేసింది. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అయ్యింది. తాజాగా ఈ అమ్మడు బంపర్ ఆఫర్ అందుకున్నట్లు తెలుస్తోంది. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగ నిర్మాతగా మారారు. ఆయన ఓ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఆయన కొత్త సినిమాలో 8 వసంతాలు ఫేమ్ అనంతిక సనీల్ కుమార్ నటించనుందట. ఈ సినిమాలో ఆమెతోపాటు యూట్యూబ్ స్టార్, మేమ్ ఫేమస్ సినిమా హీరో సుమంత్ ప్రభాస్ హీరోగా కనిపించనున్నాడని టాక్. అనంతికతోపాటు సుమంత్ సైతం ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలో తనకంటూ మంచి గుర్తింపు సంపాదించుకుంటున్నాడు. ఇదిలా ఉంటే.. అనంతికకు తెలుగులో మంచి అవకాశాలు క్యూ కట్టినట్లు సమాచారం. అలాగే సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటున్న ఈ అమ్మడు.. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంది.

## ఓటీటీలోకి 'ధడక్ 2'..

టాకీస్: బాలీవుడ్ నుంచి వచ్చి హిట్ అందుకున్న క్రేజీ సీక్వెల్ ధడక్ 2. ఈ చిత్రంలో సిద్ధాంత్ చతుర్వేది, యానిమల్ భామ త్రిప్తి డిమ్రి ప్రధాన పాత్రల్లో నటించగా.. షాజియా ఇక్బాల్ దర్శకత్వం వహించాడు. ధర్మ ప్రొడక్షన్స్ సమర్పణలో జీ స్టూడియోస్, ధర్మ ప్రొడక్షన్స్ క్లౌడ్ 9 పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఆగష్టు 01న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే తాజాగా ఈ చిత్రం ఓటీటీలోకి




రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా సెప్టెంబర్ 26 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. తమిళ చిత్రం 'పరియేరుమ్ పెరుమాళ్'కి రీమేక్‌గా ఈ చిత్రం తెరకెక్కింది.

ఈ చిత్రం నిలేష్ (సిద్ధాంత్ చతుర్వేది) విధి (త్రిప్తి డిమ్రీ) అనే ఇద్దరు ప్రేమికుల చుట్టూ తిరుగుతుంది. నిలేష్ అనే అణగారిన కులానికి చెందిన యువకుడు లా చదువుదామని న్యాయ కళాశాలలో జాయిన్ అవ్వగా.. అతడికి విధి అనే ఉన్నత కులానికి చెందిన యువతి పరిచయమవుతుంది. వీరి స్నేహం కాస్తా ప్రేమగా మారాగా.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఏంటి అనేది ఈ సినిమా కథ.



## చీరలో చందమామలా..

**అతిలోక సుందరి గారాలపట్టీ**

**అందానికి ఫిదా అవ్వాల్సిందే**

టాకీస్: జాన్వీ కపూర్ తన అందంతో అందరినీ మెస్మరైజ్ చేసే బాలీవుడ్ నటి. తాజాగా, ఆమె చీరలో చక్కని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ధడక్ తో బాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ, ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి స్టార్స్ తో కలిసి నటిస్తోంది. ఆమె అందం, నటన, సోషల్ మీడియా యాక్టివిటీ అభిమానులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. అందాల ముద్దుగుమ్మ జాన్వీ కపూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు ఈ అమ్మడు తన అంద చందాలతో ఎంతో మంది మదిని దోచుకుంది. తాజాగా చీరలో తన అందంతో మరోసారి కట్టిపడేస్తుంది.

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ధడక్ సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకుంది. తర్వాత వరసగా సినిమాలు చేస్తూ తన అంద, చందాలతో అందరిమనసు దోచేస్తుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ టాలీవుడ్, బాలీవుడ్‌లో వరసగా సినిమాలు చేస్తూ తన క్యూట్ నెస్‌తో అందరిని మాయ చేస్తుంది. గ్లోబల్ స్టార్ ఎన్టీఆర్ సరసన దేవర మూవీలో నటించి తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకుంది ఈ ముద్దుగుమ్మ. టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం వరస సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయింది. టాలీవుడ్ టు బాలీవుడ్ వరసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీ అయిపోయింది. ముఖ్యంగా రామ్ చరణ్ సరసన ఓ మూవీలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీ గనుక రిలీజ్ అయితే ఈ అమ్మడు క్రేజ్ మరింత పెరిగే ఛాన్స్ లేకపోలేదు. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది తాజాగా చీరలో తన అందంతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఈ ఫొటోస్ చూసిన వారందరూ బ్యూటిఫుల్, క్యూట్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.